# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 7-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 206 | పేజీలు:6 | వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

మూడు నామాలు
ప్రకృతి రమణికి
మూడుకు కాటు.

పెట్రోడాలరు
ఇకచెల్లని నాణ్యం
యు ఎన్ పరుగు.

పాదయాత్రలు
కాలంచెల్లిన దారి
ఉచిత పత్రం.

మర మనిషి
సమరానికి సిద్ధం
మనిషి మాయం.

పండుగ రోజు
మనసంత వసంతం
కష్టజీవికి.

– రేడియమ్
సెల్: 9291527757

**నిజాలు**

మరణిస్తే చూడండోయ్
ఆ బిడ్డల వీపు
ఉక్రేయిన్ ప్రజల గోడు
తెలుస్తుంది రేపు.

మొండి ఘటం ఒక్క మెట్టు
దిగిరానిది రష్యా !
మేడల్లో మెదులుతున్న
అది అసూర్యంపశ్య !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## బుచా మారణహోమాన్ని ఖండించిన భారత్..స్వతంత్ర దర్యాప్తు డిమాండ్‌కు మద్దతు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఉక్రెయిన్‌లో రష్యా దమనకాండ నేపథ్యంలో బుచా నగరంలో మారణహోమాన్నిభారత్ తీవ్రంగా ఖండిస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ సంక్షోభంపై బుధవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆయన బుచా హింసాకాండను ఖండించారు. బుచాలో జరిగిన హత్యాకాండను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ ఉదంతంపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలనే డిమాండ్‌కు మద్దతు ఇస్తామని చెప్పారు. మరోవైపు తమ దేశంపై రష్యా సాగించిన దురాగతాలను నిరోధించడంలో ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఘోరంగా విఫలమైందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అసంతృప్తి వ్యక్తం చేశారు.

తక్షణం స్పందించి రష్యాను శిక్షించాలని.. అది చేయలేకుంటే ఐరాసను రద్దు చేసుకోవాలని అన్నారు. భద్రతా మండలి నుంచి రష్యాను తొలగించాలని కోరారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆయన తొలిసారిగా ఐరాస భద్రతా మండలి(యూఎన్ఎస్సీ) సమావేశంలో వర్చువల్‌గా మాట్లాడారు. బుచా నగరంలో రష్యా సేనలు మారణహోమానికి పాల్పడ్డాయని, వందలాది మందిని ఉద్దేశపూర్వకంగా చంపేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.రష్యా బలగాలను జెలెన్‌స్కీ ఉగ్రవాదులతో పోల్చారు.

తమ దేశంలో రష్యా సైనికులు సాగించిన అరాచకాలు, ఐసిస్ ఉగ్రవాదుల దారుణాలకు మధ్య పెద్ద తేడా ఏమీ లేదని అన్నారు. భద్రతా మండలిలో వీటో అధికారం ఉన్న దేశంతో తాము పోరాడుతున్నామని అన్నారు. యూఎన్ఎస్సీని పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఐరాసలో భారత రాయబారి టీఎస్ తిరుమూర్తి యూఎన్ఎస్సీలో మాట్లాడుతూ బుచా నగరంలో పౌరుల హత్యలను నిస్సందేహంగా ఖండిస్తున్నామన్నారు. ఆయా ఘటనలపై స్వతంత్ర దర్యాప్తు డిమాండ్‌కు మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు.

## భోలక్‌పూర్ ఎంఐఎం కార్పొరేటర్ గౌసుద్దీన్ అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 6: విధి నిర్వహణలో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన భోలక్‌పూర్ ఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ గౌసుద్దీన్‌ను ముషీరాబాద్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గౌసుద్దీన్‌పై 353, 506 ఎఇఅ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఆ కార్పొరేటర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసు స్టేషన్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

భోలక్‌పూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజాము వరకు హోటళ్లు, షాపులు తెరిచి ఉన్నాయి. దీంతో హోటళ్లను, షాపులను మూసి వేయించేందుకు పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులను భోలక్‌పూర్ ఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ గౌసుద్దీన్ అడ్డుకున్నారు. వారితో దురుసుగా ప్రవర్తించారు. రంజాన్ మాసం ముగిసే వరకు రాత్రి పూట కూడా హోటళ్లు, షాపులు తెరిచి ఉంటాయని కార్పొరేటర్ చెప్పారు. అయితే.. తమకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని.. సమయానికి హోటళ్లను మూసివేయాలని పోలీసులు చెప్పబోతే.. మీరు రూ. 100కు పనిచేసే మనుషులని సదరు కార్పొరేటర్ నోరు పారేసుకున్నాడు.

అయితే విధి నిర్వహణలో ఉన్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఓ కార్పొరేటర్ వ్యవహార శైలిని ఓ నెటిజన్ మంత్రి కేటీఆర్, డీజీపీ మహేందర్ రెడ్డి దృష్టికి ట్విట్టర్ ద్వారా తీసుకెళ్లారు. పోలీసులకు గౌరవం ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ నెటిజన్ విజ్ఞప్తి చేశారు. ఇలాంటి నిరక్షరాస్యుల ప్రవర్తనను సహించేది లేదని ఆ వ్యక్తి పేర్కొన్నారు. ఈ ట్వీట్‌పై మంత్రి కేటీఆర్ సీరియస్‌గా స్పందిస్తూ.. ఆ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ట్వీట్ చేశారు.

విధుల్లో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ట్విట్టర్ వేదికగా డీజీపీ మహేందర్ రెడ్డిని రాష్ట్ర మంత్రి కేటీఆర్ కోరిన సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎవర్నీ సహించేది లేదని కేటీఆర్ ట్వీట్ చేశారు.

స్వార్థాలు
గుండెల్ని
విరిచేస్తే-
కష్టాలు
ప్రేమలతో
బంధిస్తాయి!

-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

## కాల్పుల్లో విద్యార్థి మృతి- యూనివర్సిటీలో భయాందోళనలు

చండీగఢ్, ఏప్రిల్ 6:: రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ఉసురు తీసింది. కాల్పుల్లో ఒక విద్యార్థి మరణించాడు. యూనివర్సిటీ వెలుపల కాల్పులు జరుగడంతో విద్యార్థుల్లో భయాందోళన నెలకొన్నది. పంజాబ్‌లోని పాటియాలాలో ఈ ఘటన జరిగింది. మంగళవారం రాత్రి పంజాబ్ యునివర్సిటీ ప్రధాన గేట్ వద్ద దౌన్ కలాన్ గ్రామం, తేరి గ్రామానికి చెందిన రెండు గ్రూపుల మధ్య గొడవ జరిగింది. తుపాకీ కలిగిన కొందరు కాల్పులు జరిపారు. దీంతో దౌన్ కలాన్ గ్రామానికి చెందిన కబాడీ క్లబ్ సభ్యుడు, పంజాబ్ యూనివర్సిటీ విద్యార్థి ధర్మిందర్ సింగ్‌కు బుల్లెట్ గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు.

పాటియాలాలోని పంజాబ్ యూనివర్సిటీ వెలుపల మంగళవారం రాత్రి 11.30 గంటలకు జరిగిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తుపాకులు చేతపట్టిన కొందరు కాల్పులు జరుపడంతో స్థానికులు భయాందోళన చెందారు. మరో యూనివర్సిటీకి చెందిన హర్బీర్ సింగ్, ధర్మిందర్ సింగ్ మధ్య వ్యక్తిగత శత్రుత్వమే ఈ ఘటనకు కారణమని పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడితో సహా నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మరోవైపు ఈ ఘటన నేపథ్యంలో యాంటీ గ్యాంగ్‌స్టర్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పంజాబ్ పోలీస్ చీఫ్ వీకే భావరాసు సీఎం భగవంత్ మాన్ ఆదేశించారు. కాగా, అక్కడి సీసీటీవీలో రికార్డైన కాల్పుల ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## విద్యార్థులకు బ్యాగ్ లు పంపిణీ చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్, ఏప్రిల్ 6:కోవిడ్ -19 అనంతరం సాంఘికంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరికి చేయూతనందించేందుకు కొన్ని వాలంటరీ ఆర్గనైజేషన్లు తమ వంతు సహాయాన్ని ప్రపంచవ్యాప్తంగా సోషల్ సర్వీసెస్ అందిస్తున్నాయి. ఇందులో భాగంగా ఇంటెల్ (వీలవ్ యు) ఆర్గనైజేషన్ తమ వాలంటరీ సర్వీస్ లో భాగంగా బుధవారం షేర్ మథర్స్ లవ్ పేరిట నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఎన్.బి.టి నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా 600 స్కూల్ బ్యాగ్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ? సోషల్ సర్వీస్ ద్వారా ప్రతి ఒక్కరికి భరోసా, సంతోషం, ప్రేమ, ఆప్యాయతలు చేరవేస్తుందన్నారు. ఈ సంస్థ ద్వారా తెలంగాణలో 5వేల మంది వాలంటరీ సోషల్ సర్వీసెస్ అందిస్తూ తెలంగాణను గ్లోబల్ విలేజ్ గా, ప్రశాంతత, ఐక్యతకు నిలయంగా మారుస్తున్నారన్నారు. ఈ సంస్థ ద్వారా పరిశుభ్రతను పాటిస్తూ వరల్డ్ క్లీన్ మూవ్ మెంట్, బ్లైండ్ డొనేషన్, ట్రీ ప్లాంటేషన్, చైల్డ్ అండ్ ఎల్డర్లీ సంక్షేమ కార్యక్రమాలు, చెరువుల శుభ్రత వంటి అనేక కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. ఈ సంస్థ ఛైర్మన్ జహాన్ గిల్ జా ప్రపంచమంతటికీ తల్లి అనే అంశంపై 2000 సంవత్సరం నుండి ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండేందుకు సమాజంలో ఇలాంటి కార్యక్రమాలను తమ వాలంటరీల ద్వారా నిరంతరాయంగా కొనసాగిస్తున్నారన్నారు.

## ప్రధాని మోదీతో భేటీ అయిన ఎన్సీపీ అధినేత శరద్ పవార్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. వీరిద్దరి మధ్య 25 నిమిషాల వరకూ చర్చలు జరిగాయి. పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయంలో వీరిద్దరి చర్చలు జరిగాయి. గత యేడాది జూలై 17 న వీరిద్దరూ కలుసుకున్నారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే కలుసుకున్నారు. మహా వికాస్ అగాఢీ, బీజేపీ మధ్య మాటల యుద్ధం సాగడం, రౌత్ టార్గెట్‌గా ఈడీ దాడుల నేపథ్యంలో వీరిద్దరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. అయితే వీరిద్దరి మధ్య ఏ ఏ విషయాల్లో చర్చలు జరిగాయన్నది మాత్రం తెలిసి రావడం లేదు. రాష్ట్రపతి ఎన్నికలు సమీపిస్తున్న వేళ వాటి గురించి ఏమైనా చర్చించి వుంటారా? అన్నది అందరూ ఊహించుకుంటున్నారు.

ఈ విషయంపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అగ్రనేత అజిత్ పవార్ స్పం దించారు. మోదీ, పవార్ భేటీ అయిన మాట నిజమేనని, అయితే వారేం మాట్లాడుకున్నారన్నది మాత్రం తనకు తెలియదని అన్నారు. ఇద్దరూ కలుసుకున్నప్పుడు దేశ రాజకీయాలతో పాటు మహారాష్ట్ర రాజకీయం కూడా చర్చకు వచ్చే వుంటుందని అజిత్ పవార్ అన్నారు.

## రాష్ట్ర పండుగగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

హైదరాబాద్, ఏప్రిల్ 6: అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలే 195వ జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 11న పూలే జయంతి వేడుకలను హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పూలే జయంతి ఉత్సవాల నిర్వహణకు రూ. 20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది.

## మన ఊరు-మన బడిలో వారు కూడా భాగస్వాములు కావాలి : మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్, ఏప్రిల్ 6 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకే సీఎం కేసీఆర్ దూర దృష్టితో మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మన ఊరు ? మన బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్లపల్లి గ్రామంలో రూ.11.22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సదర్భంగా మంత్రి మాట్లాడుతూ..కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో ప్రధానంగా 12 మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా 335 పాఠశాలలు ఎంపిక కాగా మొదటి దశలో 260 పాఠశాలల్లో పనులు ప్రారంభించనున్నట్లు వివరాలను వెల్లడించారు. మన గ్రామాల్లో ఉన్న పాఠశాలలు ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు పూర్వ విద్యార్థులు, ఎన్నారైలు, గ్రామస్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ధాన్యం కొనేదాక బీజేపీ సర్కారుతో కొట్లాడుతాం

హైదరాబాద్, ఏప్రిల్ 6:రాష్ట్రంలోని వరి ధాన్యం కొనుగోలు చేసేవరకు కేంద్రంలోని బీజేపీ సర్కారుపై కొట్లాడుతామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. తెలంగాణలో యాసంగిలో పండించిన రైతులు పండించిన ధాన్యాన్ని పంజాబ్ తరహాలో కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాగ్ పూర్ జాతీయ రహదారిపై కడ్తాల్ జంక్షన్ వద్ద రైతులు, టీఆర్ఎస్ ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిపై బైటాయించి రైతులను అరిగోస పెడుతున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల పక్షనా దర్నా చేస్తున్న వారికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సంఘీభావం తెలిపారు. వరి ధాన్యం కొనుగోళ్ళలో కేంద్ర వైఖరిని నిరసనగా వరి గొలుసులను ప్రదర్శించి, నాగలి పట్టారు.

ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండిన ప్రతీ గింజ కేంద్రం కొనుగోలు చేసేదాకా తెలంగాణ రైతుల పక్షనా టీఆర్ఎస్ ప్రభుత్వం పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని తెలిపారు. బాజాప్తా వరి వేయండి. మీ వడ్లను మేం కొనిపిస్తామన్న బీజేపీ నాయకులు తీరా పంట చేతికి వచ్చాకా మోహం చాటేస్తున్నారని బీజేపీ తీరును తప్పుపట్టారు. ఇంత మండుటెండలో కూడా టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి రైతుల పక్షనా దర్నా చేస్తున్నారని,ఇకనైనా కేంద్ర బీజేపీ సర్కార్ బుద్ధి తెచ్చుకుని కళ్ళు తెరవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర బీజేపీ నాయకులు తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పి, వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై బైటాయించి ప్రజలను ఇబ్బందులు పెట్టాలనే ఉద్దేశ్యం టీఆర్ఎస్ కు లేదని, ఇలాంటి నిరసన కార్యాక్రమాలతోనైనా ఢీల్లీ సర్కారుకు సెగ తగులుతుందని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

## వర్షాకాలం లోపు పైపులైన్ పనులు పూర్తి చేయాలి: మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, ఏప్రిల్ 6:వర్షాకాలం వచ్చేలోపు మంచినీటి పైపులైన్ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో సాయి సామ్రాట్ నగర్ జిల్లెలగూడ, టీఎంఆర్ ఎన్ క్లేవ్ -2, టీకేఆర్ కాలేజ్ దగ్గర మీర్పేట్, యందు మంచినీటి వాటర్ పైపులైన్ పనులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకే రోజు 371 కోట్ల భారీ నిధులతో చేపట్టే పనులకు మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రూ.1200 కోట్లతో నగర శివారు ప్రాంతాల పట్టణాలకు నీటికోసం నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ నగరంలో లాగా గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదని తెలిపారు. చెరువుల మధ్యలో లింక్ ల ఏర్పాటు, రానున్న వర్షాకాలం కన్నా ముందే పనులు పూర్తి చేయాలని సబితా రెడ్డి ఆదేశించారు.

## ఆలయాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 6: రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెడుతున్నారని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసర మండలం రాంపల్లి దాయర గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం సీతా రాముల కల్యాణ మహోత్సంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, పూర్ణహూతి తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, ఎంపీపీ ఇందిర, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో జాతీయ రహదారులపై టీఆర్ఎస్ పార్టీ రాస్తారోకో

హైదరాబాద్, ఏప్రిల్ 6:రాష్ట్రంలో జాతీయ రహదారులపై టీఆర్ఎస్ పార్టీ రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టింది. తెలంగాణలో రైతులు పండించిన యాసంగి వరి ధాన్యం మొత్తాన్ని కేంద్రమే కొని తీరాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు కార్యకర్తలు ధర్నాలకు దిగారు. పలు చోట్ల రహదారులపై నాయకులు బైఠాయించారు. నాగపూర్, ముంబై, బెంగళూరు, విజయవాడ జాతీయ రహదారులపై నిరసన తెలుపాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

బుధవారం ఆయా జాతీయ రహదారులు వెళ్లే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొని, రాష్ట్ర రైతాంగం పక్షాన టీఆర్ఎస్ ధర్నాగ్రహాన్ని ప్రకటిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట జిల్లాలో జగదీశ్‌రెడ్డి, జనగామ జిల్లాలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిర్మల్ జిల్లా కడ్తాల్ జంక్షన్ వద్ద ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, రైతుబంధు సమితి బాధ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేసేంత వరకు ఉద్యమిస్తాం : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 6:: రాష్ట్రంలో జాతీయ రహదారులపై టీఆర్ఎస్ పార్టీ రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టింది. తెలంగాణలో రైతులు పండించిన యాసంగి వరి ధాన్యం మొత్తాన్ని కేంద్రమే కొని తీరాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల తో పాటు కార్యకర్తలు ధర్నాలకు దిగారు. నాగపూర్, ముంబై, బెంగళూరు, విజయవాడ జాతీయ రహదారులపై నిరసన తెలుపాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.అందులో భాగంగా.. కేంద్రం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్-బెంగుళూరు(భూత్పూర్) జాతీయ రహదారిపై టీఆర్ఎస్ చేపట్టిన రాస్తారోకో రాస్తా రోకోలో ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, జైపాల్ యాదవ్, ఎస్ ఆర్ రెడ్డి, అంజయ్య యాదవ్, గువ్వల బాలరాజు,బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అబ్రహం, పట్నం నరేందర్ రెడ్డి, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతి నిధులతో కలిసి రోడ్ పై బైఠాయించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ. .కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పంజాబ్‌లో ధాన్యం కొను గోలు చేసినట్లుగానే తెలంగాణ ధాన్యాన్ని కొనాలన్నారు. మోదీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతుందని ఆరోపించారు. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనేలా చేస్తామన్నారు.

## ఆమె ఆరోగ్యానికి 'ఋతు- ప్రేమ'.. మంత్రి హరీశ్‌రావు సరికొత్త ఆలోచన

సిద్దిపేట, ఏప్రిల్ 6 : స్వచ్ఛ సర్వేక్షణ్ 2021లో జాతీయ స్థాయి, దక్షిణాది రాష్ట్రాల్లో మొదటి స్థానంలో నిలిచిన సిద్దిపేట మున్సిపాలిటీ మరో ముందడుగు వేసింది. పట్టణ వ్యాప్తంగా మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని 'ఋతు ప్రేమ' అనే కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శ్రీకారం చుట్టారు

. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ మహిళకు రుతుస్రావ కప్పులు, బట్ట ప్యాడ్లు, చిన్న పిల్లలకు బట్ట డైపర్లను ఉచితంగా పంపిణీ చేసే ఓ సరికొత్త ఆలోచనకు హరీశ్‌రావు అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేటలోని ఐదో వార్డులో హరీశ్‌రావు బుధవారం ప్రారంభించి, మహిళలకు రుతుస్రావ కప్పులు, బట్ట ప్యాడ్లు, పిల్లలకు డైపర్లు అందించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. బట్ట ప్యాడ్స్ వాడటంలో ప్రపంచానికే సిద్దిపేట ఆదర్శంగా నిలవాలన్నారు. రుతుస్రావం గురించి మాట్లాడానికి జుగుప్సాకరంగా ఉంటుంది. అయినప్పటికీ దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి నెల జరిగే రుతుస్రావ ప్రక్రియలో బట్ట ప్యాడ్లు, రుతుస్రావ కప్పులు వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు రావు. డబ్బు వృధా కాదని మంత్రి స్పష్టం చేశారు.

ఐదో వార్డు ప్రజలు తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేయడంలో ఆదర్శంగా నిలిచారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రుతు ప్రేమ కార్యక్రమానికి ఈ వార్డును పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. మీ ఆరోగ్యాన్ని మీరే కాపాడుకోవాలి, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలోని మహిళ ఉద్యోగులకు త్వరలోనే అవగాహన సదస్సును ఏర్పాటు చేసి, బట్ట ప్యాడ్స్ పంపిణీ చేస్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.







సుఖనిద్రల కగు తావువు
అజ్ఞానానికి ప్రోవువు
మరుల పరిమళాలు జల్లు
తామసి నువు నెత్తావువు!

అన్నము కన్నను మిన్నగ
మిమగొనుట సదా యెన్నగ
ఆరోగ్యము సౌభాగ్యము
శాకములారా చెన్నగ!

ప్రగతికి కట్టిన బారులు
శ్రమజీవన బేహారులు
చీమలు మనుషుల కన్నా
క్రమశిక్షణలో దారులు!

మట్టికి మనిషికి బంధం
పుట్టుక ఒక ఆనందం
తట్టుకొనక కాలానికి
మట్టిన కలిసే గంధం!

మూడు కనులు నీకున్నా
చూడలేని ఓ కన్నా
తీర్థమూ ప్రసాదములను
కలిగిన టెంకాయన్నా!

నీవే కలుషిత సంపద
నీతో వచ్చును ఆపద
రోగము లుచితముగ నిచ్చు
ఈగా పదవే పదపద!

చూపుల కందము వెల్లీ
కందలు తిందువు తల్లీ
తిందురు విందుగ మనుజులు
అయ్యయ్యో చెవుల పిల్లీ!

తడారి పోయిన జీవుల
ఎడారి ఓడవు నీవిల
హడావుడిగ నడిచే ఓ
లొట్టిపిట్ట నీవొక కళ!

రాశులలో అగ్రేసర
మాంసాహారుల ఆసర
మేషమా! విశేషమైన
కసాయిల సిరి సరసర!

నేటినిజం
# సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 7-4-2022

నేటి దృశ్యం

## ఆమె శిరోరత్నం

ఆమె శిరోరత్నం
స్థానం పాతాళం
ఆమె కలువ కంటి
కష్టం పీకల బంటి
ఆమె చివురుబోడి
ఆకలి కోసిన కోడి
ఆమె పలుకులమ్మ
చదువులేని కొమ్మ
ఇదే పురుషవాదం
బానిస సామ్రాజ్యం

-కిలపర్తి దాలినాయుడు
7780589336




గుండె తాకని అక్షరం
గురి చెదరిన బాణం
ఇది ఖాయం
రెండూ చరిత్రహీనం

పిల్లలు
తెల్లటి కాగితాలు
వాటి స్వచ్ఛతపై ఎందుకు
'డాలర్' మరకల సంతకాలు.

ఆయుధం కన్నా
అబద్ధమేం తక్కువా?
కురుక్షేత్రంలో
'అశ్వత్థామ హతః కుంజరః

చివరి శ్వాస
ఎప్పుడో ఎవరికేమెరుక
మనిషిగా జీవించు
ఈ క్షణం నుండిక

అతి మంచితనం
పేరు తెలియని రోగం
వారికి తప్పదెప్పటికైనా
'హరిశ్చంద్ర' యోగం.

పట్టాలెక్కని
చట్టాల స్వైరవిహారం
రాతి పడవలపైనే
మన ప్రయాణం.

-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

## నానీలు

ఇల్లు అద్దెకివ్వబడును అని
బోర్డు వ్రాసి వుంది
ఇంకుడు గుంతలు
ఉన్నాయో లేదో రాయలేదు.

పని సులువు అవడానికి
ఆధునిక పరికరాలెన్ని ఉన్నా
పని చేసే వాడెపుడు
ఏదో పని చేస్తూనె వుంటాడు.

క్రూర మృగాలు సైతం
వేటాడి తినాల్సిన పనిలేదు
జూలో వాటన్నింటికి
వడ్డించిన విస్తరే.

ఉగాది విచారంగా వుంది
షడ్రుచుల కలిపే పచ్చడిలోకి
చేదునిచ్చే వేప చెట్టుకు
తెగులు సోకి ప్రమాదంలో వున్నందుకు

మా ఇంట్లో పెళ్ళికి
మా ఇంట్లోనె సందడి
శీతారాముల పెళ్ళికి
దేశమంతా సందడి.

- కందేపి రాజ్యలక్ష్మి
సెల్: 9391349049

## ఘంటారవం

ద్రవ్య జ్ఞానమే
దారి చూపుతుందనుకోకు
దివ్య జ్ఞానం
ధర్మ మార్గమని మరువకు.
మంచితనం మాటున
వంచన పొంచి ఉంటుంది
ఎర రూపంలో వల
ఎదురు చూస్తుంటుంది.

మానవత్వముంటేనే
వ్యక్తిత్వం
పత్రహరితముంటేనే
వృక్షత్వం

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# సమాజ పార్శ్వాలను తట్టిలేపిన 'ఝంఝామారుతం'

కవిత్వం ఒక్కో కవికి ఒక్కో రకంగా ద్యోతకమవుతుంది. కవిత్వం అంటే రెండు వైపులా పదునున్న కత్తి అంటారు కవి శివారెడ్డి. అదే కవిత్వాన్ని ఒక ఆట అనుకుంటే అందులో క్రీడాకారులు కవులు అని, పాఠకుల హృదయమే క్రీడాస్థలి అని, కవితా రసాస్వాదకులే సహృదయ న్యాయ నిర్ణేతలు అంటారు ఆచార్య కడారు వీరారెడ్డి. తన పదహారో కవితా సంపుటిగా 'ఝంఝామారుతం'ను ఇటీవలే ఆవిష్కరించారు.

ఆలోచనలు ముసురుకున్నప్పుడు వాటిని కవితీకరించినప్పుడే కవికి సాంత్వన. ఆలోచనల వేగం ఉప్పెనలా ఎగసిపడినప్పుడే ఝంఝామారుతంవంటి కవితను రాయగలరేమో. అందుకే ఈ కవితా శీర్షికనే కవి పుస్తకానికి టైటిల్‌గా ఎంచుకున్నారు కవి. అందుకు తగినట్లుగానే వీరారెడ్డి కవిత్వం వేగంగా రాయగలరు. ఆయన 2014లో భాన్వరాలు సంకలనంతో సాహితీలోకంలోకి అడుగుపెట్టారు. అప్పటి నుంచి నిరంతరాయంగా రాస్తూ వస్తున్నారు. ఎనిమిదేళ్లలో పదహారు సంకలనాలను తీసుకురావడం ఆయన వేగానికి నిదర్శనం.

జీవితమే కవిత్వం అంటారు కవి యాకూబ్. నిజమే. దైనందిన జీవితంలో అనుభవికంగా ఎదుర్కొనే సంఘటనలేగా కవిత్వం కావలిసినవి. జీవితం కవిత్వం అవుతుందనడానికి ఝంఝామారుతంలోని కవితలే సరైన ఉదాహరణ. 'కళ్లు తెరిచి చూడగానే



/ వర్తమానంలో కదలాడింది / గానుగెద్దులా నడవాల్సిన మరో రోజు' అంటూనే... హ్హహ్హహ్హ..! అని నవ్వుతూ కవితను ముగిస్తారు. కలలోని మెలకువలా సాగుతుందీ కవిత. వాహ్యాళి వరపుత్రిక కవితలో 'ఉదయం పూట వాహ్యాళి / ఉదయ భానుడి సాహచర్యం' అంటారు. కదలిక మనిషికి ఎంతో అవసరం. ఉదయం వేళల్లో దేహానికి సూర్యుడి కిరణాలు సోకితే ఆ రోజంతా హుషారుగా సాగుతుంది. ఇవే కాదు మానవీయకోణంలోనూ ఎన్నో కవితలను ఆవిష్కరించారాయన. 'కవిత కంచికి' శీర్షికన సాగే కవితలో 'కాగితం కవితకే కాదు / ఆకలికీ ఔషధంగా పనికొస్తుందం'టూ మానవత్వాన్ని చాటారు. ఇవే కాకుండా కరోనా మహమ్మారి చేసిన అల్లకల్లోలంపై ఆవేదన వ్యక్తం చేశారు. 'నెలల తరబడి మనిషిని / ఇంటికే పరిమితం చేసిన కాలం' అంటారు తన కరోనా కాలం కవితలో. యువత బాధ్యతనెరిగి మసులుకోవాలని సూచిస్తూనే, వృద్ధులను అనాథలుగా వదిలేసి అనాథలు అవ్వొద్దని సూచిస్తూ మరో కవితలో.

ప్రేమ కవితలు అక్కడక్కడా ఒకటి రెండు ఉన్నప్పటికీ ప్రధానంగా సామాజిక బాధ్యతను విస్మరించని కవిత్వాన్ని అందించారు వీరారెడ్డి. అడవి రాక్షసి అనే కవితలో 'ఆకలి మనిషిని.. / దిగజార్చుతుంది నిర్దాక్షిణ్యంగా / అథఃపాతాళానికి / తినిపిస్తుంది / బురద మెతుకునూ సైతం' అని ఆకలి చేసే ఆకృత్యాలపై వేదన చెందుతారు. ఆడపిల్లలపై పెరుగుతున్న అత్యాచారాలను అనాగరికతగా అభివర్ణిస్తారీ కవి. 'మృగతృష్ణ' శీర్షికన రాసిన కవితలో 'అత్యాచారం.. / అడివి నాగరికత / తోలును వేటాడే తోడేళ్ల / మ(మృ)గతృష్ణ' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 69 కవితలు ఉన్నాయీ పుస్తకంలో. ప్రతి కవితా ఆసక్తికరంగా సాగుతూనే పాఠకుల మదిమూలాల్లోని సామాజిక బాధ్యతలను తట్టిలేపుతుంది. ఝంఝామారుతం పేరిట

పుస్తక సమీక్ష

అంతే వేగంగా ఆగకుండా చదివించగలిగే కవిత్వాన్ని అందించిన ఆచార్య కడారు వీరారెడ్డికి శుభాకాంక్షలు.

**ప్రతులకు:**
ఆచార్య కడారు వీరారెడ్డి
ఇ.నెం.8-12-20
బృందావనర్ నగర్
రోడ్ నెం.8, హబ్సీగూడ
హైదరాబాద్-500 007
9392447007



-సర్రీన్ ఖాన్
9652432981

# న్యాయమూర్తుల తీర్పులు వారి వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి

విశ్రాంత జస్టిస్ బి.చంద్రకుమార్ రాసిన **'వినర కుమారా వివరించే చెబుతా'** పుస్తకావిష్కరణలో ఆచార్య మసన చెన్నప్ప, జీవన్‌లాల్ లవాడియా, జస్టిస్ చంద్రకుమార్, బిక్కి కృష్ణ, జస్టిస్ రాధారాణి, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, డా॥నాళేశ్వరం శంకరం తదితరులు సభలో ప్రసంగిస్తున్న జస్టిస్ రాధారాణి, బిక్కికృష్ణ

**-హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి**

న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు వారి వ్యక్తిత్వాలను తెలియజేస్తాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి అన్నారు. శనివారం రాత్రి సుందరయ్య కళా నిలయంలో అరిగపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, ఉగాది జాతీయ పురస్కారాల ప్రదానం, విశ్రాంత జస్టిస్ బి.చంద్రకుమార్ రాసిన **'వినర కుమారా వివరించే చెబుతా'** పుస్తకావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథి జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ కవులు ఎల్ల ప్పుడూ ప్రజల బాగు కోసం ఆలోచిస్తూ రచనలు చేస్తారన్నారు. జస్టిస్ చంద్రకుమార్ ఇచ్చిన తీర్పులు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. అరిగపూడి పూర్ణ చంద్ర రావు ఫౌండేషన్ జీవన సాఫల్య ఉగాది జాతీయ పురస్కారాలను రవికాంత్ రమణ, టి. సత్యనారాయణ, యలవర్తి ధనలక్ష్మి, సముద్రాల శ్రీదేవి, సాయి శిరిషకు అందజేశారు. 20 మందికి జాతీయ ఉగాది పురస్కారాలను అందజే శారు. 24 మందికి కళా సాహిత్య పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి ప్రముఖ రచయిత బిక్కి కృష్ణ అధ్యక్షత వహించారు. ఐటీ అడిషనల్ కమీషనర్ జీవన్‌లాల్ లవాడియా, ప్రముఖ సాహితీ వేత్త డా॥ మసన చెన్నప్ప, కవయిత్రి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం పాల్గొన్నారు.

# కొత్త రైతు

(కథ)

''అంజమ్మ ఏంజేత్తానవే''తల దువ్వుకుంటా సాయబానలకచ్చింది వనజ.

"ఏం లేదు బిడ్డా బువ్వ వండుతున్నా నాయిన కైకిలికి పోతాండు"

"మరి నువ్వు ఎవలకు పోతానవే"

"ఇంకెవలు పిలువలేదు ఎవలన్న పిలు స్తరేమోనని నిన్న చీకటిబడ్డ కానుండి తిరుగుతున్నానే" వనజకు చెప్పుకుంటనే చెక్క సందుగల గిన్నెలు,ఉట్టిమీద పాల గిన్నె పెట్టింది.

''గుడుకుంటెనకకు నాటున్నది వత్తవానే" ఇసుర్రాయిల పప్పుతిప్పుతున్న యారాలు రాధమ్మ అన్నది.

అంజమ్మసప్పుడు చేయలేదు.మొన్ననే ఎనుగు కాడనో పనుగడి కాడనో చిన్న జగుడం అయింది.ఇద్దరికి అది నన్ను పిలుసుడేంది అనుకుండేమో మూతి మూడువంకర్లు తిప్పి పొయ్యి దిక్కు జూసి కోపంగ పొయ్యిల మంటెగేసింది.

"పైసలు అక్కరున్నయన్నవ్ గదనే దానిమీద గురెందుకు యారాండ్లేనాయే ఇయ్యాలైన రేపైన ఒక్కటిగావల్సిందే గదా!" చిన్నగా అంజమ్మకు ఇనబడేటట్టు అన్నది వనజ.

మోటబాయిమీది నుండి కుండల నీళ్ళు తెచ్చింది చిన్నది.

''బిడ్డా పటువలన్ని నింపి పెట్టే మాపటికి తిప్పలైతది"అంజమ్మ బిడ్డకు పురమాయించింది.

"కవిత గంత దూరం నుండి ఎందుకు మోత్తానవే రాజన్నోళ్ళ బాయికి తెచ్చుకోవచ్చుగదనే"నెత్తిల దువ్వేనబెట్టుకుంటన్నది వనజ.

"బిల్లదూలం మంచిగలేదట అక్కా"

ట్రాన్స్ ఫారమ్ బోయి తిప్పలగాబట్టే లేకుంటే నల్లత్తే గీతిప్పలే వుండకబోవు" చిన్నగా ససుగుకుంట లోపటికచ్చిండు వెంకన్న.

కోడి అటుకుమీది నుండి దబ్బుక్కున క్కొ.క్కో.క్కో అంటు కింద దునికి బెదురు బెదురు చూడబట్టింది. అది పిల్లిని జూసి బెదిరింది,వెంకన్న పిల్లిని ఎల్లగొట్టిండు.

గడంచ కింద కోడితన పిల్లలను గట్టిగా రెక్కలకింద దాచుకున్నది. పొడగాటి జుట్టున్న పుంజు గడంచె సుట్టు తిరుగుతాంటే దాని కాలుకుకట్టిన గజ్జె గల్లుగల్లు మంటుంది.

కూర్చోను పీటవేసి వెంకన్నకు నీళ్ళ చెంబుపెట్టి అన్నం పెట్టింది అంజమ్మ.

నిన్ననే చీకటిబడినంక రోట్లే కాల్చిన బెండకాయలు చింతపండేసి తొక్కునూరింది.

వెంకన్న కూసుండి గిన్నెల చేయిబెట్టి అంజమ్మ దిక్కు ప్రేమగా జూసిండు.

అంజమ్మ ఆ కండ్లల్ల ప్రేమను గమనించిందేమో! ఆమె చెంపలు ఎరుపెక్కాయి, తనలో సిగ్గులు మొగ్గలై పెదవిపైకచ్చాయి ఆ నవ్వును దాస్తు అక్కడ నుండి లేచి ఉట్టిమీది చల్లకుండను తీసి గుండ్రంగా కలె తిప్పిపక్కన పెట్టింది.

పెనిమిటి పక్కన గూసుండి వడ్డిస్తాంది అంజమ్మ.

''పెద్దోనికి పరీక్షలు అయినయటా ఇయ్యాలా ఇంటికస్తాండు వాడిముందటా ఎవుసం ముచ్చట్లు ఎవ్వారం ముచ్చటతీయకు ఇంటే వాని మనసు కరాబై తది."అన్నంతిని చేయికడుక్కుంటు అన్నడు.

"గట్లనే నాకు తెలువదా ఏంది వాళ్ళ చదువెప్పుడవుతదో ఎప్పుడు నౌకరి జేత్తరో మన కష్టం ఎప్పుడు బాత్తదో ఆ వేములాడ రాజన్నకు వేయి మొక్కులు మొక్కుతానా" చేత్తో దండంబెట్టుకుంటా అంది.

వెంకన్న చేయికడుక్కుని లేచి తువ్వాలకు తుడుచుకుని వాసం మీది బీడికట్ట తీసుకుని భయటకచ్చిండు.

కొట్టంలున్న దుడ్డేకు పచ్చగడ్డేసుకుంటా దాన్ని మెడచుట్టు చేతులేసి మురిసిపోబట్టింది చిన్నది కవిత. గేదేపిల్ల సంబురంగా అటు ఇటు ఉరుకుతాంది.

"బిడ్డా అడ్డం పడుతవే" కీకేసిండు వెంకన్న సంటిది కవిత వినకుండా దానివెంబడే తిరుగుతాంది.

ఊరపిచ్చుకలు కిటికీకి కట్టిన వరికంకి గింజలను తింటు కిచకిచ మంటున్నాయి.

వెంకన్న రాజన్నచ్చినంక ఇద్దరుగల్సి నాగలిగట్టుకుని పొలంకు పోయిండ్లు.

వెంకన్న నాగలి రాజన్న గొర్రుమొద్దు ఒకరెనుక ఒకలు బోతాంటే భయటకచ్చి చూసింది అంజమ్మ.

ఎనుగు మీద బచ్చలితీగ ఇరగబారింది ఎండపొడకు మధ్యమధ్యలో చెమికిలలెక్క మెరిసే ఎర్రటి బచ్చల పండ్లు ఎంత ముద్దుగున్నాయో! ఓ చేయిని గదుమ కిందబెట్టుకుని మరోచేత్తో ఆకులను నిమురుకుంట మనసుల అనుకున్నది.

కొడుకస్తాండని పెనిమిటి జెప్పే వెళ్ళాల్నా వద్దయని సోంచాయించింది కాసేపు. ఆ తరువాత ఏమనుకున్నదో అర్రలకు బోయి గడంచమీది కొడవలి లిక్కి తీసుకుని వాకిట్ల యాపచెట్టు కిందకచ్చి నిల్చుని యారాలు రాధమ్మ ఇంటిమోకాన జూసింది.

అది సద్దిగట్టుకుని భయటకచ్చింది.దాని మొఖం జూడాలంటే ఇష్టమనిపిత్తలేదు. కని

**'ఊరంత ఎంత గొప్పగా చెప్పాను. నా కొడుకు నలుగురికి అన్నం బెట్టెటోడు అయితడు పదిమందిని సాత్తడు అంటే ఆ దేవుడికి గీతిర్న అర్థమైందేమో!**

తప్పదాయే కైకిలి చేత్తే చేతుల ఖర్చులకు పైసలన్నుంటాయి. మనసులనుకుంటా చేతులున్న తువ్వాల మడతబెట్టి సంచిలబెట్టుకుంది అంజమ్మ.

"యాల్లైతాంది వాళ్ళందరు పోతాండ్లు రా అక్క" పిలుసుకుంట ముందుకు కదిలింది రాధమ్మ.

తనను అనుసరించింది అంజమ్మ.

×××××

దయ్యాల మర్రి కాడా దుమ్ము దట్టంగా అలుముకుంది. దాన్ని చీల్చుకుంటూ బస్సు వచ్చి ఆగింది. రోడ్డు పక్కనే వున్న కట్టు కాలువవుతలి పొలంల కలుపుతీసెటోళ్ళు లేచి చూడబట్టిండ్లు.

సైకిలు మీద యారియ సంచి తీసుకుని వచ్చేటోడల్లా ఆగి బస్సులకెళ్ళి దిగిన నరేష్‌ను జూసి పలకరించి పోయిండు రాజు.

నరేష్ బ్యాగును భుజానికేసుకుని ఊళ్ళికు వచ్చిండు.

బడికాడ పిల్లలు చూసి "నరేషన్న నమస్తే మంచిగున్నవా?"నవ్వుకుంటా అన్నరు.

చేర్ లో కూర్చున్న జ్యోతి మేడం వెనకకు తిరిగి చూసి నవ్వింది.

"గుడీవినింగ్ మేడమ్!"

"ఓహ్ !..నరేష్ బాగున్నావా?"

"బాగున్నాను మేడమ్"

"పిల్లలు ఏంది ఇంత తక్కువున్నారు?"

"నిన్నమొన్నటి దాకా కరోనా కదా! పిల్లలు ఇప్పుడిప్పుడే స్కూలుకు వస్తున్నారు."నవ్వుతు అంది జ్యోతి మేడమ్.

- జ్యోతి మేడమ్ చాన సంవత్సరాల నుండి ఈ ఊర్లోనే పని చేస్తుంది.

ఊరిలో ఎవరితోను ఎక్కువగా మాట్లాడని నరేష్ అదే స్కూల్లో వాలంటరి టీచర్ గా చేరినప్పటి నుండి జ్యోతి మేడమ్ తో చాల చనువుగా వుండేవాడు.

స్కూల్లో ప్రైవేటుకు పంపించే వాళ్ళందరితో మాట్లాడి నరేష్ జ్యోతి మేడమ్ పిల్లలను భయటకు వెళ్ళకుండా చాల చక్కగా చదువు చెప్పేవారు. ఏ విషయమైన తనతో షేర్ చేసుకునే వాడు నరేష్. అగ్రికల్చర్ బియస్సీ సీటు రావడంతో ఇన్ని రోజులు చదువుకోసం పట్నంబోయి ఇప్పుడే వస్తున్నాడు.

పిల్లలు నరేష్ చుట్టూ చేరినారు. మేడమ్ చేర్ చూపించింది. బ్యాగు కాళ్ళపై పెట్టుకుని కూర్చున్నాడు.

భవిశ్యత్తు కార్యచరణపై ప్రశ్నలడిగింది మేడమ్. అదే విషయమై ఊరికచ్చినట్లు చెప్పినాడు.

"నరేష్ నువ్వు ఏది చేసిన ఆ పనిలో ఒక స్పెషల్ వుంటది"నవ్వుతు అంది జ్యోతి.

"వెళ్తాను మేడమ్ మళ్ళీ కలుస్తాను"

"ఊరు ఎలా వుందో చూడాలి కరోనా వచ్చి పోయిన తరువాత ఇప్పుడే గదా రావడం".

"నిజమే! ఈ కరోనా ఎంతమందిలో ఎన్ని మార్పులు తెచ్చిందో" జ్యోతి మేడమ్ చేతిలోని పుస్తకాన్ని ముడుస్తు అంది.

"నిజమే! నేనైతే ఒక విధముగా మళ్ళీ మంచిరోజులు వచ్చాయనే అనుకుంటున్నాను."

చూద్దాం ముందు ముందు ఇంకా ఎలావుంటుందో "

"సరే మేడమ్ నేను కలుస్తాను" నరేష్ భుజం కున్న బ్యాగును సరి చేసుకుంటు ఊర్లేదిక్కు నడిచిండు.

పడమటి గుట్ట మీద నుండి సూర్యుడు మెల్ల మెల్లగా జారుకుంటున్నాడు.

చింతచెట్టు కింద ముసలోల్లు కొందరు ముచ్చట్లేవో చెప్పుకుంటున్నారు.

జాలారు కాడా మందారచెట్టు కింద కుక్క తనపిల్లలకు పాలిస్తూ అందులో ఒక పిల్లను నాలుకతో నిమురుతుంది.

'ఈ లోకంలో మాతృప్రేమ ఎంత గొప్పది

మనిషైనా - జంతువైన ఏ జీవైనా అమ్మ ప్రేమకు పాత్రుడు కావల్సిందే కదా'

పనుగడి తీసుకుని లోపలి కచ్చిండు నరేష్.చుట్టూ అమ్మ పెంచిన గోరంట చెట్లు బంతిపూల చెట్లు చూడంగనే ఆకర్షించి నాయి. నిచ్చమల్లె చెట్టు మీద వాలి ఎగిరివెళున్న తూనీగ నేలమీద పరుచుకున్న గడ్డి గులాబి,చామంతులు ప్రేమగా స్వాగతం పల్కినాయి.

దాన్ని చూడగానే నరేష్ కు చాల సంబురమైంది. ఎంతుండేది ఎంత పెద్దగైంది. పక్కనే వున్న కోడిపిల్లలను లెక్క పెట్టిండు.

ఇంటి వెనుక పెరట్లకు బోయి చూసిండు.

చిన్నప్పటి నుండి తిరిగిన జాగైనా అంతా కొత్తకొత్తగా అనిపిస్తుంది. పొద్దు పోయింది.

మెల్లమెల్లగా మసకచీకట్లు అలుముకున్నాయి.

అంజమ్మ వెంకన్న ఒకరితరువాత ఒకరచ్చిండ్లు.

కవిత కొప్పేర్ల నీళ్ళు కాగబెట్టి వుంచింది.

''ఎప్పుడచ్చినవ్ బిడ్డా!'' అంజమ్మ కొడుకును దగ్గరకు తీసుకుని అంది.

"సాయంత్రం బస్సుకే వచ్చిన అవ్వ!"

"తింటలేవా బిడ్డా! ఇంత చిక్కిపోయినవ్"

"లేదే నేను మంచిగనే వున్నాను నీకే అట్లా గొడుతాంది"

అంజమ్మ చెమర్చిన కండ్లలో నుండి కంటి చుక్కలు నరేష్ భుజాలపై రాలినాయి.

"అంజమ్మ! ఏందే అది"ముందే చెప్పిన సంగతేదో గుర్తు జేసినట్టు సైగజేసిండు వెంకన్న.

అంజమ్మ నరేష్ ను ప్రేమగా ముద్దుపెట్టుకుంది.

"వాడు ఎప్పుడనగా తిన్నాడో ముందు ఆ పనిజూడు " వెంకన్న చెప్పి ఎడ్లకు మేతవేయడానికి కొట్టంలకు పోయిండు.

అంజమ్మ పనులన్ని చేసుకుని కొడుకచ్చిందని ఇష్టమైన కూరలతో వంటజేసింది.

అందరు సాయబానల కూర్చుండి ముచ్చట్లు చెప్పుకుంటా భోజనం చేసిండ్లు.

నరేష్ నాయినకు ఎట్లాజెప్పాలేయని సోంచాయించబట్టిండు

''ఏంది బిడ్డా! ఏందో దీర్ఘాలోచన లబడ్డవ్ "

వెంకన్న గమనించి అన్నడు.

''నాయిన నేను నీకో విషయం జెప్పాలనుకుంటున్నాను"

''చెప్పయ్యా!'' వెంకన్న ప్రేమగా పక్కకువచ్చి కూర్చుంటు అన్నాడు.

"అది..అది.." నీళ్ళు నమిలిండు నరేష్.

''మా దగ్గర నీకు వోహామాట మెందుకురా"

''చెప్పుబిడ్డా!''అంజమ్మ దగ్గరకచ్చి అన్నది.

"నేను వ్యవసాయం చేద్దామనుకుంటున్న నాయినా" మనసులో మాట భయటపెట్టిండు నరేష్ .

అంజమ్మకు కాళ్ళ కింది భూమి కంపించినట్లయింది.

కొడుకు దిక్కు నీర్గాంతపోయి చూస్తుంది. గొంతులో ఏదో ఉండచుట్టుక పోయినట్లయింది.

ఏం మాట్లాడలన్న నోరు పెకులుతలేదు.

"మంచి నిర్ణయం తీసుకున్నవ్ కొడుకా" అన్నడు సంతోషంతో వెంకన్న.

అంజమ్మ పెనిమిటి దిక్కు కోపంగ జూసింది.

"ఎన్ని కలలు గన్నాను బిడ్డా! నీకోసం చేయరాని కష్టమంతా జేసినం గదరా నువు నౌకరిజేత్తే జూసి మురవాలను కుంటి అంత చదువు చదివిత్తే నువ్ మళ్ళా గీ జంగలి బతుకే కావాలని కోరుకోబడితివి నువ్వేం దయ్యా వాడు ఏదంటే అదే అంటున్నావు"నెత్తి నోరు కొట్టుకుంటా ఏడుస్తు అంది అంజమ్మ.

" నువ్వు కాస్త నోరుమయ్ వాడేమన్నాడని అంత లొల్లిచేస్తానవు. వ్యవసాయం జేస్తనంటాండు తప్పేముంది అందరు నౌకరిగాల్లే అయితే రైతు ఎవలైతరు దేశానికి అన్నం పెట్టేవాడే కరువైతే ఈ మనుషులు ఏం తింటరు ఎలా బతుకుతరు రైతంటే రాజు ఈ దేశానికి వెన్నముక లాంటోడే అంజమ్మా"

కొడుకు తీసుకున్న నిర్ణయంతో ఉప్పొంగిపోయి అన్నాడు.

"నేను వాన్ని గొప్పోనిగా చూడాలనుకున్నాను వాడు నౌకరిజేస్తు కార్లల్లో మహారాజులా తిరుగుతుంటే జూడాలనుకున్నాను .రేపటి సంది ఊళ్ళోళ్ళకు, చుట్టాలకు, పక్కాలకు ఏమని జెప్పుకుంటము. అందరు చిన్నచూపు జూత్తరుగదయ్యా! ఏడుస్తు నెత్తి నోరు కొట్టుకుంటా అంజమ్మ కోపంగా అంది.

"అమ్మా నేను నౌకరిజేసెటోళ్ళకంటే ఎక్కువనే సంపాదిస్తనే ఇదువరకంటే కరువస్తదనే భయముండేది.ఇప్పుడు ప్రాజెక్టులచ్చినాయి ,కాలువల నిండా నీళ్ళు బారుతున్నాయి, పంటలకు రందిలేదు దండిగా పండుతాయి నా మాట నమ్ము" బతిమిలాడుతున్నట్టుగా అన్నడు.

"నీ ఇష్టం బిడ్డా! మీ అయ్య కొడుకులు ఏం జేస్తరో చేయుండ్లి" కోపంగా మంచంలో రుసరుసలాడుతూ పక్కేసుకుని అటు తిరిగి పడుకున్నది అంజమ్మ.

'ఊరంత ఎంత గొప్పగా చెప్పాను. నా కొడుకు నలుగురికి అన్నం బెట్టెటోడు అయితడు పదిమందిని సాత్తడు అంటే ఆ దేవుడికి గీతిర్న అర్థమైందేమో! కొద్దిసేపు వేములాడ రాజేశుని ఫోటో దిక్కు జూస్తూ దేవుడిపై అలిగి కోపగించుకున్నది. మనసులా ఎన్నో ఆలోచనలు తిరగబట్టినాయి. చానసేపు సోంచాయించినంక చింతపిక్కల్లా మారిన కండ్లను తుడుచుకుంది.ఓ తరికజూస్తే కొడుకు చెప్పింది కూడా నిజమే గదా ఎసొంటోళ్ళ అవ్వ నాయిన అయిన కొడుకులు మంచి మంచి నౌకర్లు జేస్తే చూద్దామనుకుంటరు గని బిడ్డా! నువ్ ఎవ్వసం జేయమని ఎవలు ధైర్యంగా జెప్పుతారు.గట్ల జెప్పితే భవిష్యత్తుతరానికి బువ్వ బెట్టే రైతులను అందించినోళ్ళవుదురు గదా! నా కోడుకు చాన తెలివైనోడు వాడి మాట నేనెందుకు కాదనాలి అని ఆలోచించుకుంది.

ఆ నిషీరాత్రి నిశబ్దాన్ని కమ్ముకుని మౌనమునిలా కూర్చుంది.

×××××

ఉగాది పండుగ

పల్లె రైతులందరు కొత్తసాలు పండుగ జేసుకుంటాండ్లు.

ఏడు మోటబొక్కేండ్ల బాయి.ఎనుకటి సంది నిండు కుండతరికుంటది. ఆ బాయికాడ ఎడ్లకు స్నానంజేయించి పసుపు కుంకుమలతో అలంకరించిండ్లు.

నాగలిని కడిగి పసుపు బొట్లు పెట్టింది అంజమ్మ.

ముళ్ళు కర్రను కూడా అలంకరించిండు వెంకన్న.

నరేష్ తలకు రుమాలు జుట్టుకుని నాగలి కట్టిండు.

అంజమ్మ హారతిచ్చి ఎదురచ్చింది.

కొత్త రైతును జూసి ఈ నేలమ్మ మురిసిపోయింది. చుట్టూ పరుచుకున్న చెట్లూ చేమలు స్వాగతం పలికినాయి.

పరవశించిన కాడేడ్లు జోరుగ పొలంలోకి దిగి ముందుకు సాగినాయి.

ఆకాశం ఆనందంతో అక్షింతల చినుకులను జల్లింది.

దుక్కుల్లన్ని పచ్చని పైరులై గాలి హ్వాయలతో నాట్యమాడాయి.

వ్యవసాయం దండుగన్న చోట పండగయింది ఇప్పుడు.

కొత్త రైతు నరేష్ పెదవులపై చెరగని చిరునవ్వులు విరిసినాయి.

వెంకన్న ఈ దేశానికి ఓ గొప్ప రైతునందించానని తృప్తిగా నవ్వుకున్నాడు.

-వజ్జీరు ప్రదీప్
9989562991

## శాంతిపర్వం

ఆశలు తీరితే
అంతకంటే కావలసింది ఏముంది...
కోరుకున్నదే దరికి చేరితే
అంతకంటే ఆనందం ఏముంటుంది...
కానీ అక్కడే ఉంది అసలు కిటుకు...
అందరానివి ఆశపడినా..
కోరరానివి కావాలన్నా..
భంగపడుట ఖాయం..
అధికార వ్యామోహం..
తాను మాత్రమే గెలవాలన్న స్వార్థం..
అంతా తనకే దక్కాలన్న మొండితనం..
దానికోసం ఎంతకైనా తెగించే
రాక్షసత్వం...
అలవికాని కోరికలతో
మనసు యుద్ధభూమిని తలపిస్తుంటే...
ఎక్కడ ఉంటుంది శాంతిపర్వం...
మంచిని మాత్రమే ఆలోచించడం ధర్మం...
ఆ ఆదర్శాన్ని ఆచరించడమే న్యాయం...
అనుకూలమైన ఆలోచనలతో...
అందరికీ ఆమోదయోగ్యమైన
జీవితాన్ని గడపడం..
అవకాశాలను అందుకుంటూ..
అతి విలువైన సమయాన్ని ఉపయోగించి..
ఉన్నతంగా ఎదగడమే
మనిషి జన్మకు సార్థకం..
అదే అనంతమైన ఆనందానికి కారణం...
ప్రాణికోటి సర్వం ఒకటే
ఆత్మస్వరూపం అన్న సద్భావంతో..
సార్వజనిక క్షేమం కోరడమే సౌశీల్యం..
సత్సాంగత్యంతో పొందే ప్రశాంత జీవనాన్ని...
ఆస్వాదించే ప్రతీక్షణమొక శుభతరుణం!
వసుధైకశాంతిని కోరే
ప్రతీమనసొక దేవాలయం!

-విజయ రామగిరి
9949043229

సాహిత్యం
ఆహ్వానం
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్త ఆధ్వర్యంలో
సంగీతం
ప్రముఖ కవి
శ్రీ మాయకుంట్ల నారాయణరెడ్డి
రచించిన
నగ్నధ్వని (అశ్వాలు)
గ్రంథావిష్కరణ మహోత్సవము
తేది : 09-04-2022 శనివారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : శ్రీ త్యాగరాయ గానసభ, కళాసుబ్బారావు కళావేదిక, హైదరాబాద్
ముఖ్య అతిథి : ఆచార్య కొలకలూరి ఇనాక్
పద్మశ్రీ అవార్డు గ్రహీత, పూర్వ ఉపకులపతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం
సభాధ్యక్షులు : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
అదనపు జిల్లా కలెక్టర్, మేడ్చల్
విశిష్ట అతిథి : శ్రీ కళా వి

## ఆ సమయం వస్తే గిస్తే...

ఒకరు ఒకర్ని ఏదో అడుగుతూ
ఇంకెవరికేసో చూపించారు
ఆ ఇంకెవరో తనను ప్రత్యేకమైన
వ్యక్తిగా ప్రకటించుకుని లోలోపల
ఏ వ్యక్తితే తనను చూపించారో
వారికోసం వెతుకుతున్నాడు
విచిత్రమేమిటంటే ఆ గుంపులో
ఎవరు ఎవర్ని చూస్తున్నారో
ఎవరికేసి మాట్లాడుతున్నారో
ఎవరు ఎవర్ని వెతుకుతున్నారో
అర్థంకానంత తికమక!
సందట్లో సడేమియా...
కొన్ని చూపులేమో దేహాలను
ఆసాంతం కొరుక్కుతింటున్నవి
కొంతసేపు పోయాక నిజమైనవేవో
కల్తీవేవో గుర్తుపట్టలేనంతగా–
కలిసిపోతున్నాయో మారిపోతున్నాయో...
అవసరానికనుగుణంగా రంగులు
మార్చుకుంటున్నాయో...
రూపాంతరం చెందుతున్నాయో...
దిగజారి పోతున్నాయో...
తెలియని పరిస్థితి!
పైకి మాత్రం ఊరికే క్షమించమని
పదే పదే నవ్వు మొహాలతో కృత్రిమ
చేష్టలతో అన్నీ ఎరిగి...
కైపెక్కి మత్తులో లోపలి మనుషులేమో
అరాచకాన్ని సృష్టించడానికి
తయ్యారుగా ఉన్నారు!
వెంట్రుకవాసి తేడాలో–
ఒద్దనుకుంటే ఇటూ లేదంటే అటూ
పడిపోతారు
చేతులు ఉవ్విళ్ళూరుతున్నాయ్
పండ్లు పటపటమంటున్నాయ్
శరీరాలు లేకి సెగలు కక్కుతున్నాయ్
లోపల రిహార్సల్స్ జరుగుతున్నాయ్
వదిలేస్తే ఒక అనాగరిక దృశ్యం
ప్రదర్శితమవుతుంది
ఒళ్ళు గగ్గుర్లు పొడిచేది
చూస్తారా వద్దా..??
అది మన విజ్ఞతకు వదిలేయబడింది!!

– రఘు వగ్గ
9603245215

## ఎక్కడుంది సామ్యవాదం..?

నిరుపేదల పిల్లలు..
బతుకుకై పోరాటము..
ధనవంతుల పిల్లలు..
బడికొరకై ఆరాటము..
ఏమిటిది భారతమ్మ..
ఎక్కువ తక్కువలెందుకమ్మా..
బడికెళ్లె వయసులోన..
బాధ్యతలను మోస్తుండెను..
బడికోయి పిల్లల చూసి..
బాధతో కుములుతుండెను..
అయ్యయ్యో బాలలార..
చదువులమ్మకు దూరమైతిరా..
అక్షరాలు దిద్దుకుంటు..
ఆడుకునే వాళ్ళు మీరు..
తోటోళ్లను చూసుకుంటు..
తల్లడిల్లుతున్నరు..
ఎందుకింత ఘోరము..
పేదవాడిగా పుట్టడమెనా..
రాజ్యాంగమందులోనా...
రాసి ఉండెను హక్కులు..
రాత పూతలు నేర్చుకొని..
మార్చుకోండి బతుకులు..
చదువుకోండి బాలలు..
చక్కగుండును భవితలు..

–పసుల.శంకర్
9542181301

## శాంతి మెరుపులు

స్వార్థం పెరుగుటే
యుద్ధానికి అడుగు
వెనక్కు తగ్గుటే
మంచికి ముందడుగు !!

అమాయక ప్రజలను
మట్టు బెట్టకు
ప్రజల హృదయాలను
గాయ పరచకు !!

కడుపు సల్లగుంటదా
ప్రజలు రోదిస్తే
నిజం దాగుంటదా
ప్రజలను బాధిస్తే !!

విడదీయరాని సంబంధాలను
ప్రేముంటే కలుపుకో
ఆప్యాయత అనురాగాలను
అభిమానముంటే నిలుపుకో !!

కన్ను ఈర్ష్యపడిన
యుద్ధానికి అడుగు
సంబంధాలు తెగిపడిన
కావాలి ప్రేమతొడుగు !!

గౌరవం లేనిచోట
యుద్ధం మొదలైతది
చూపాలి మంచిబాట
యుద్ధం సమసీపోతది !!

కలం జులిపిస్తే
అద్భుతమైన కవితలైతయ్
గలం నినదిస్తే
శాంతి సందేశాలైతయ్ !!

పాఠాలు నేర్పడానికి
పెన్ను ప్రేరణ
ప్రాణాలు తీయడానికి
గన్ను విస్ఫోటన !!

–తాండ్ర చిరంజీవి
9959180762.

## కవిత్వం-మొగ్గలు

కవన కదనరంగంలో వీరవిహారం చేస్తేనే
సమాజంలోని రుగ్మతలు భగ్నమయ్యేది
నిజాలను నిర్భయంగా రాసేదే కవిత్వం

రైతుల హలానికి కలం కాపలా కాస్తేనే
దళారుల దోపిడీలు దహనమయ్యేది
రైతన్నల పక్షాన నిలబడేదే కవిత్వం

శ్రామికుల కష్టాలకు బాసటగా నిలిస్తేనే
శ్రమైక జీవన సౌందర్యం కలకాలం నిలిచేది
శ్రామికులకు వెన్నుదన్నుగా ఉండేది కవిత్వం

కుళ్ళు రాజకీయాల క్రూకటి వ్రేళ్ళను పెకలిస్తేనే
ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించగలిగేది
అవనీతి పాలకుల గుండెల్లో ఫిరంగులే కవిత్వం.

మహిళల భద్రతచట్టాలకి చుట్టంగా నిలబడితేనే
మృగాళ్ళ కుత్తుకలపై కత్తులను దించగలిగేది
దగాపడ్డ ఆడబిడ్డలకు ఆసరాగా ఉండేది కవిత్వం

– కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## ఆకాశమే హద్దుగా

నిరంతరం నిలకడ
లేకుండ నేల మీద
తిరిగే ఆమె ఇప్పుడొక
ఆగిపోని గడియారం
ముల్లైయ్యింది! .
బతుకు బండిని నడిపేందుక
సిద్ధమయ్యే ఆమే
కందెన పూయని ఇరుసుల మారి
గిరగిర తిరుగుతుంది!
ఒకప్పుడు వంటింటికి పరిమితమైన
ఆమె ఉనికి నేడు ప్రపంచాన్ని శాసించే
దిశగా పయనిస్తుంది!
విభిన్న పాత్రలను పోషించే ఆమె
అవలీలగా అన్ని రంగాల్లో చేరి
విజయాన్ని సాధిస్తుంది!
ఆకాశాన్ని అందుకోబోతున్న
ఆమెలోని ఆత్మస్థైర్యం ఉన్నతమైన
శిఖరంల నిలబెట్టింది!
తనను కాదని అడ్డుపడే వారే లేకపోతే
తన హద్దులను చెరిపేస్తూ
ఆకాశాన్ని
దాటి పోతుంది!!

–ఎస్. జవేరియా
9849931255

పుస్తక సమీక్ష

## గుడ్డెలుగు బల్గం

ఊహల ప్రపంచమే బాలసాహిత్యం. చెట్టు, పుట్ట పిట్టలతో మాట్లాడిస్తూ, జంతువులతో జతకట్టి, ఆడుతూ పాడేది పిల్లల సాహిత్యం గా చెప్పవచ్చు. ఊహలకు రెక్కలు కట్టి, ఆకాశానికి నిచ్చెన వేసి, ప్రకృతిలో ప్రతి వస్తువు తమదేనని విహరించే కల్మషం లేని బాల్యం అమూల్యమైనది. మరి అలాంటి బాలసాహిత్యంలో విశేష కృషి చేస్తున్నా శ్రీ పైడిమర్రి రామకృష్ణ గారు.

తెలంగాణ రాష్ట్రం నుండి ఎక్కువ కథలు రాస్తున్న ప్రముఖ రచయిత శ్రీ పైడిమర్రి రామకృష్ణ. ఈయన ప్రైవేటు రంగంలో ఉద్యోగం చేస్తూ, విరామసమయంలో కథలు రాస్తూ బాలల లోకంలో విహరిస్తూ ఉంటారు .ఇప్పటివరకు ఆయన దాదాపు 450 కి పైగా కథలు రాశారు. రచయిత తాను రాసిన కథ లేని తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారుండరు. ప్రస్తుతం "గుడ్డెలుగు బల్గం" పేరుతో కొత్త కథా సంపుటిని ప్రచురించారు.

ఎన్ని సంవత్సరాలు గడిచినా కూడా పిల్లలు పిల్లలే కదా. కాబట్టి వారికి తప్పనిసరిగా బాలసాహిత్యం అవసరం. బాల కథలు రాసేటప్పుడు రచయిత సరళమైన పదాల వాడుక భాష ఉపయోగిస్తూ, పిల్లలకు అర్థమయ్యే విధంగా వెలువరించారు.

తెలంగాణలో ఎలుగుబంటిని గుడ్డెలుగు అని పిలుస్తారు. బల్గనీ అంటే సైన్యము బలము అని చెప్పవచ్చు .అందుకే శీర్షిక వినూత్నమైనదిగా పెట్టారు. వర్షం ద్వారా లభించిన నీటిని అడవిలో నిల్వ చేయాలంటే చెరువులు బావుల్లో పూడిక తీయాలి. ఇంకుడు గుంతలు తవ్వాలి అనే చక్కటిసందేశాన్ని "మృగరాజు సలహా కథ"లో చెప్పాడు.

ప్రతి ప్రాణికి ఒక నైపుణ్యం ఉంటది. అందుకే ఇతరుల నుండి కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటే మనకి మంచిదని "కొత్త నైపుణ్యాలు" కోతి, కొంగ ,నెమలి సంభాషణ ద్వారా చెప్పాడు.

"గుడ్డెలుగు బల్గం"లో మంచి మనసు ప్రేమ సహాయ గుణాలే సొంత బలగాన్ని సంపాదించు కుంటాయి అని చక్కగా ఆవిష్కరించారు.

ఆకలితో ఉన్న వాళ్లను ఆదరించి నప్పుడు కలిగే ఆనందం గొప్పదని "హృదయానందం" లో చెప్పారు రచయిత.

మనం చేసే మంచి పనులే మన కోసం వచ్చి స్నేహం చేస్తారని "మంచి పని కథ" లో తెలుసు కుంటాం.

"కాకమ్మ కడియం కథ"లో ప్రయత్నిస్తే మంచి ఫలితం ఉంటుందని పైడి మర్రి తెలియజేశారు.

పైడి మర్రి రాసిన మొత్తం 29 కథలో ప్రతి కథ అణి ముత్యమే. నేటి రాకెట్ యుగంలో మన పిల్లలకు ఇంకా పాతతరం కథలే చెప్పకుండా పక్షులు జంతువుల తో మాట్లాడిస్తూ చక్కటి సందేశాన్ని అందించే రచయిత ఆలోచన చాలా గొప్పది.

"గుడ్డెలుగు బలగనీ" బాలల కథలు కథా సంపుటి ముఖ చిత్రం చాలా బాగుంది. అడవి జంతువుల తో ఆకర్షణీయంగా శివాజీ చిత్రిం చారు. డిటిపి సంజయ్ గ్రాఫిక్స్ వారు అందిం చారు. పేజీల సంఖ్య 68 ,పుస్తకం వెల 80 రూపాయలు

–ప్రతులకు :పైడిమర్రి రామకృష్ణ
ఇంటి నెంబర్ 9బి86/1
శ్రీ కృష్ణ టెంపుల్, నారద్గుల్ –501510
బాలాపూర్ మండల్
రంగారెడ్డి జిల్లా
చరవాణి:9247564699

–యాడవరనీ చంద్ర కాంత్ గౌడ్
9441762105

## సమరసతా నానీలు

సమతామూర్తి సాక్షిగ
సమతాగానం
చేతల్లో లేకుంటే
హృదయగాయమే

రామానుజుని సమత
సర్వకాలీనం
మారకుంటే లేదు
మనకిక మోక్షం

పైపై కన్పించేదంతా
సాపేక్షం
అంతర్నిహితం ఏదో
అదే సత్యం

నిలువైన అడ్డమైన
ఏముంది?
నిలువు దోపిడీ
లేకుంటే చాలు!

సిద్ధాంతాల వైవిధ్యం
సహజమే
రాద్ధాంతాల వైరుధ్యమే
నిరోధకం

కులమతవర్గ కుట్రల
ఫలితమే!!
వృద్ధి చెందుతున్న
దేశమనే మాట!

సమతా పదము
బుద్ధివరకే
సమరసత మాట
హృదయానికి

సామాజిక విభజనలు
ఎన్నున్నా
మనుషుల
అస్తిత్వం ఒక్కటే

హిందువా నీవు
మతతత్వవాదివి!
సకలక్షేమం
కోరేవాడివి కదా!

క్రూసేడు యుద్ధాల
కారకులం
అయినా మేము
శాంతికాముకులం

రాజ్యాంగమార్పుకిచ్చిన
పిలుపు
దళితబంధుకి ఓ
చెక్ పాయింటేమో

కలానికి
హృదయముందేమో
బాధతో
కన్నీళ్ళసిరా ద్రవిస్తుంది

మతం మత్తుమందన్న
ప్రతీవాడు
భార్యతో గుడికి
వెళ్ళేవాడే

పంచభూతాలకు
అంటుముట్టు లేనట్లే
ఆత్మకేదీ లేదు
అంటరానితనం

విభజనవాదులు
విదేశితొత్తులు
తెల్లోరి
వారసులేమో!

దేశమంటే
మనుషుల ఐక్యత
దేశమంటే
సుగంధమట్టి కూడా

–కృతి (కలం)
9949394688

## కాలం జ్ఞాపకాలు...!!

బాల్యము ఆనందం కోరెను
యవ్వనము ప్రేమకు తపించెను
నడివయసు తోడు కావాలనిపించే
చివర్లో పలకరింపు లే చాలు
అనిపిస్తుంది బాధ్యత కుంగదీస్తుంది

భవిష్యత్తు అంధకారం కనిపిస్తుంది
ఆలోచన సుడులు తిరుగుతుంటే
వర్తమానం పంజరం పక్షిలా అయ్యింది...

కాలం జ్ఞాపకాలను మింగేస్తుంది
నదీ ప్రవాహం లో రాళ్ళు తేలుతున్నట్లు
రూపము యవ్వనం కోరుతుంది
చుక్కలతో ఆకాశం మెరిసినట్టు..

మనస్సులో ఏదో వెలితి
సముద్రములో నీళ్లను బడబాగ్ని తాగినట్లు
ముత్యాలు ఎన్ని దాచుకున్న
నదుల కలయికకు సంద్రం ఎదురుచూస్తున్నట్లు...

పాత బావిలా తయారయ్యింది మనస్సు
మంచి నీరంతా వదులుకొని
చెత్తాచెదారం నింపుకొని
విజ్ఞానపు ఊటలు చేజార్చుకుంది...

గ్రంథ కుసుమములు తినగలిగితే
మనో వికాసం వికసించి పరిమళించు
లోకజ్ఞానం రుచి చూడగలిగితే
సమస్త జ్ఞాన ఫలమును
ఆస్వాదించి అనుభవించు..

–కొప్పుల ప్రసాద్
9885066235

## సింహం-చిట్టెలుక గేయం

అందమైన అడవిలోన
చీకటిగల గుహ ఉండెను.
గుహలోన క్రూరమైన
సింహం ఒకటి దాగి ఉండె
ఒకనాడు చిట్టెలుక
గుహ దగ్గరికి వచ్చెను
సింహం నిద్రిస్తుండగా
దానిమీద దుంకె ఎలుక
జూలు మెత్త గున్నదనుచు
ఎలుక అందులో తిరుగుచుండె
సింహంకు గిలిగింతలవగ
మేల్కొనెను అది అప్పుడు
కోపముతో గర్జించెను
జూలునంత విదిలించెను
నా మీద దుంకుటకు
నీకు ఎంత ధైర్యమనెను
దానిమాటలకు ఎలుక
ఈ విధముగ పలుకుచుండె
సింహము సింహము రాజా!
నామీద కరుణ చూపు
ఎప్పుడైనా నీకు నేను
సహాయము చేస్తాను
సరేపో యిట నుండి
కలుగులోకి వెళ్ళిపో!
కొంతకాలమైన పిదప
వేటగాని వలయందు
సింహమపుడు చిక్కుకొనెను
దూరంనుంచి చూసిఎలుక
అయ్యో మృగరాజనీవు
ఆపదలోచిక్కినావు
అంటు వలనంత తన
కోర పండ్లతో కొరికి వేసె
అప్పటినుండి వారిద్దరు
ప్రాణ స్నేహితులయ్యారు
చిన్న పెద్ద తేడా పడ్డు
అందరు సమానమన్నారు.

–పడిగె ఐశ్వర్య
6వ, తరగతి
జడ్పీహెచ్ఎస్ గుర్రాలగొంది
జిల్లా సిద్దిపేట.

## ప్రకృతి రేఖ

ఎవరూ ఉండరేమో ఆఖరుకి
ఎవరూ మిగలరేమో కొసకి
తలాలు తలకిందులై
అస్తిత్వాలు కోణాలు తిరిగి
జిగ్ జాగ్ గా మనుషుల సమూహం
వాళ్ళ దిశలు దశలు...
సదిశరాశులుగా అదిశరాశులుగా...
ఒక ఎంట్రోపి క్రమం క్రమరాహిత్యంలో!
ఇక్కడ అర్థాలకు అర్థం–
అపార్థాలలోంచి పశ్చాత్తాపపు సర్దుబాటు!
దీర్ఘకాలం నడిచేవి... టక్కున ముగిసేవి
ఎక్కడో ఓ చోట ఎప్పుడూ ఓ ఘర్షణ ...
తాజాగా దూరంగా ఒక–
తెలతెలవారుతున్నప్పుడుండే
వాసనలా... దృశ్యంలా...
నగారా మోగుతున్నట్టుండే సందడిగా
ఉత్సవంగా ఉండే పరిసరాల్లా...
అన్ని మొహాలు కళాకాంతులీనుతూ మళ్ళా!
అన్నిచోట్లా అంతేనేమో
అన్నీ కలిసే ఒక పోకడనేమో
ఒంటరితనం మరీ ఎక్కువై
మానసికం కకావికలమేమో
ఉన్నవాళ్ళు లేనితనంకోసం
లేనివాళ్ళు ఉండేవాటికోసం
నిరంతరం వెంపర్లాటలో–
తత్వాల వ్యాఖ్యానం చేస్తూ
అంట్లు గట్టుతూ... మరమ్మత్తు చేస్తూ
ఎటో ఓ తీరంలోకి–
కొత్తగా తయారవ్వడానికో
మళ్ళీ రావడానికో
లేదా అర్థాంతరంగా
అంతర్ధానం అవ్వడానికో
అర్థంకాదు ఎప్పటికీనూ..!!
ప్రకృతి ఏమాత్రం చనువిచ్చినా
మనిషి ఎంత విర్రవీగేవాడో కదా!
పట్టుకుని వెనక్కి లాగడం వల్లే
తన నీడను తను చూసుకుంటూ
తన వడిలో ఒక రేఖపై పాల్గొంటూ
పాకుతున్నాడు చచ్చినట్టు..!!!

– రఘు వగ్గ
9603245215

కరోనా కథలు

## తల్లి మనసు

(కథ)

షంశాబాద్ ఏర్ పోర్ట్ ఔట్ గేట్ వద్ద వీల్స్ సూట్ కేస్ లాకుంటూ వంగిన నడుముతో టక్ వేసుకుని వస్తున్న ఓ పెద్దాయన కన బాడ్డాడు. అతన్ని ఇదివరకు ఎక్కడో చూసిన అనుమానంతో అతనికి ఎదురెళ్లి తీక్షణంగా చూశా, తాను నన్ను గమనించడం లేదు. నా అనుమానం కరక్టే అతనెవరో కాదు గురునాథమేనన్న నిర్ధారణ కొచ్చి "సర్ గురునాథం సార్" అని పిలిచా.

నా పిలుపుకు అవాక్యయి "ఎవరా?" అని తన చలవ నల్ల కళ్లద్దాలు తీసి నా వైపు తిరిగి చూశాడు ప్రశ్నార్థకంగా..

ఇది గమనించి "సర్ నమస్కారం నేను ఎలక్ట్రిసిటీ లైన్ ఇన్స్పెక్టర్ విజయ్‌ని"...

ఓ నిమిషం పాటు ఆలోచించి "ఎవరూ..? ఆ సులోచనమ్మ హాస్పెండ్‌వు కదూ..? అన్నాడు అనుమానంగా.

"అవును సార్ నేనే.."

"అబ్బో ఎన్నాళ్ళయింది, చాలా నాళ్లైంది కనీసం పాతిక సంవత్సరాలైంది కదా! గుర్తు పట్టలా.. అయినా కాస్త చత్వారం కూడా.."

"సార్ ఇప్పుడేనా రావడం.."

"అవును ఇప్పుడే గాని, నీ పేరు విజయానందు కదూ..? సులోచన మీ అబ్బాయి హర్షవర్ధన్ బాగున్నారా?"

"అందరం బాగున్నం సార్.. మరి మీరూ బేబీ నందిత బాగున్నారా..?

"అందరం బాగే.." అతని మాట పూర్తవక ముందే

"అది సరే ఎక్కడి నుండి వస్తున్నారు సార్?" అని అడిగా

"అయ్యో నీకు తెలువదు కదూ! అయినా నీకు చెప్పనేలేదు కదా! నందితను మీ దగ్గరి నుండి తీసికెళ్ళిన తర్వాత నేను సెకండ్ మ్యారేజ్ చేసుకున్నాను లే. ఆమెకు పుట్టిన అబ్బాయే ఇప్పుడు స్టేట్స్‌లో జాబ్ చేస్తున్నాడు, అతని దగ్గరి నుండే వస్తున్నాను..." అతను చెప్పడం పూర్తవక ముందే

"సర్ మేడం రాలేదా? మరి బేబీ నందిత ఎక్కడ సర్". "నా శ్రీమతి స్టేట్స్‌లోనే ఉంది. నందిత ఇక్కడే మన గాంధీ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్."

తన మాట పూర్తవక ముందే కుతూహలంతో "అంటే నందితను ఇక్కడ.."

"అవును, ఇక్కడే ఉంది. తానిప్పుడు ఫేమస్ గైకొనలిస్ట్ తెల్సా?.." అని గురునాథం చెప్పగానే, ఆ డాక్టరమ్మ పుట్టిన నాటి రోజులన్నీ నా కళ్ళముందు కదలాడ సాగాయి..

×××

ఆ రోజుల్లో కరోనా వైరస్‌తో జనమంతా భయంతో వణికిపోతున్నారు. ఎక్కడి కక్కడా లాక్‌డౌన్. ప్రయాణాలు లేవు, ఒకరిని ఒకరు కల్సుకునేది లేదు. బంధు మిత్రులందరూ ఉండి కూడ ఏకాకి బతుకులే.

> "ఏం లేదు, నీకు నీవే ఆ పొంగి వచ్చే పాలను చేత్తో పిండుకోవాలి. లేదంటే తల్లి లేని శిశువులకు గానీ, ఎవరైనా తల్లులకు పాలు లేకపోతే గానీ ఇవ్వవచ్చు.."

అప్పుడు నేను ఓ మారుమూల గ్రామంలో జూనియర్ లైన్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్నాను. నా సహ ధర్మచారిని సులోచన నిండు గర్భవతి. తనకు అనుకోకుండా ఏదైనా జరిగితే ఎలాగో అని భయపడ్తూనే ఉన్నాను. నా భయంకు తగ్గట్టు నవమాసాలు నిండి పురిటి నొప్పులు రానే వచ్చాయి. చుట్టు పక్కల అందుబాటులో ఎక్కడ కూడా ప్రసూతి కేంద్రాలు లేవు. అన్నీ మూసి వేయబడి ఉన్నాయి. ఉన్నదల్లా ఒక్కటే. అదీ జిల్లా కేంద్రంలోనే.

అక్కడ మొత్తం కరోనా కేసులే, వెళ్ళిన వారిని క్వారంటైన్ లేదా ఐశోలేషన్‌లో అడ్మిట్ చేసుకుంటున్నారని బాధ. సులోచనకేమో మొదటి కాన్పు. ఏం చేయాలో అర్థం కాక చివరికి తెగించి మా డిపార్ట్‌మెంట్ వెహికల్‌తో జిల్లా ఆసుపత్రికి బయలుదేరాను. కరోనా భయంతో నా వెంబడి డ్రైవరు తప్పా మరింకెవరూ రాలేదు. తనకు పురుటి నొప్పులు ఎక్కువవుతూనే ఉన్నాయి. బాధను తట్టుకోలేకపోతున్నది. ఇదిగో అదిగో అంటే కనీసం గంట కన్నా ఎక్కువే అయింది, మరో అయిదు నిమిషాల్లో ఆసుపత్రికి చేరుకుంటా మనేంతలో తను వ్యానులోనే మృత శిశువుకు జన్మనిచ్చింది. ఇది చూసి నిర్ఘాంత పోయా. ఎలాగైతేనేం హాస్పిటల్లో అడ్మిట్ చేశా.

శిశువు పోయినందుకు ఇద్దరం ఎంతో దుఃఖపడ్డాం. మా దుఃఖం చూసి "ఇంకా మంచిదే అయ్యింది. పెద్ద ప్రాణం పోయేడిది, ఊరుకోండి" అని ఓదార్చారు, ఆసుపత్రి సిబ్బంది.

అప్పటికీ రెండు రోజులు కావొస్తోంది. లాక్‌డౌన్ మూలంగా బంధు మిత్రులు మమ్మల్ని పరమార్శించడానికి ఎవ్వరూ రాలేదు. ఓరోజు ఉదయం నేను సులోచనకు టీ తాగిస్తున్నప్పుడు "ఏమండీ!..' మెల్లిగా ఏదో చెప్తున్నట్లుగా ఆగిపోయింది.

ఇది గమనించి "ఏంటి సులోచనా! ఏమైందీ? ఏమైనా ఇబ్బందిగా ఉందా..?" అడిగా.

లేదండీ?.."

"మరేంటీ..?.. ఏమైంది అంత ధీనంగా.."

నన్ను మరింతగా దగ్గరికి పిలిచి "నా రొమ్ముల్లో ఉబికి వస్తున్న ముర్రుపాల నొప్పికి తాళలేకపోతున్నానండీ.. " అంటూ మెల్లిగా నా చెవిలో చెప్పింది..

ఆమె మాటకు నాక్కూడా ఏం అర్థం కాలేదు. "డాక్టరమ్మకు చెప్పలేకపోయావా! ఏమైనా మెడిసిన్స్ ఇచ్చేదేమో.." అని చెప్పా.

"మీరన్నట్టు రాత్రి డాక్టర్ మేడంతో చెప్పాను..'

"మరేమంది?.." అని అడిగా.

'మందులేం వాడొద్దట, అలా వాడితే భవిష్యత్తులో మళ్లీ తల్లివైతే పాలు రావట.." అని చెప్పగానే! మళ్లీ నేనే అడిగా "మేడం మరి ఎలా?? అని

"ఏం లేదు, నీకు నీవే ఆ పొంగి వచ్చే పాలను చేత్తో పిండుకోవాలి. లేదంటే తల్లి లేని శిశువులకు గానీ, ఎవరైనా తల్లులకు పాలు లేకపోతే గానీ ఇవ్వవచ్చు.." అని చెప్పింది.

"మరి నీవేం డిసైడయ్యావు.." అని అడిగా.

> "కరోనా వైరస్‌తో జనమంతా భయంతో వణికిపోతున్నారు. ఎక్కడి కక్కడా లాక్‌డౌన్. ప్రయాణాలు లేవు, ఒకరిని ఒకరు కల్సుకునేది లేదు"

"వీటన్నింటి కన్నా ఎవరైనా తల్లిని పోగొట్టుకొని పుట్టిన శిశువులు ఉంటే వారికి నేనే స్వయాన నా స్తన్యాన్నిఇవ్వాలను కుంటున్నాని చెప్పా. మీ అనుమతి కోసం ఆగా.." అని ధీనంగా అడిగింది.

"సులోచనా! నీవెంత గొప్పమనసున్న మాతృ మూర్తివి. నిజంగా నీవు దేవతవు. చక్కని ఆలోచన. నిజంగా అమ్మ మనసంటే ఇదే గ్రేట్.." నీకు నచ్చిన ఈ అద్భుతమైన ఆలోచనతో రెండు మహా ఫలితాలున్నాయి. ఒకటి శిశువును పోగొట్టుకున్న నీ వ్యథ దూరమవుతుంది. రెండోది తల్లిని పోగొట్టుకున్న పసికందులకు స్తన్యాన్నిచ్చి ఆదుకొని వారికి అమ్మలేని లోటు తీర్చి ఒక గ్రేట్‌తల్లిగా నిలిచిపోతావు. నీ నిర్ణయం అమోఘం సులోచనా!" అంటూ ఆమె నుదురును స్పర్శిస్తున్నంతలో.

"సార్ మేడం విజిటింగ్ కొస్తున్నారు" అని వార్డ్ సిస్టర్ చెప్పగానే నేను బయటకి వచ్చేశా.

అలా సులోచన హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయిన తర్వాత మాకు మరో సంతానం అయ్యేంత వరకు పాపను మా వద్దే ఉంచేశారు గురునాథం వాళ్లు. సులోచన కోరుకున్నట్టుగానే తల్లిని పోగొట్టుకున్న పసిపాపకు పాలు పట్టి పెద్ద చేసిన ఆ పాపే ఈ నందిత.

ఇలా అలనాటి విషయాలన్నీ నేను నెమరు వేసుకుంటున్నంతలో "విజయ్! నేను వెళ్తాను". "అని గురునాథం పలకరిస్తేగాని ఆనాటి స్మృతుల నుండి నేను తేరుకోలేదు"

"అవునూ నందిత మిమ్మల్ని చాలా సార్లు గుర్తు చేసిందయ్యా. మీ అడ్రస్ లేక మిమ్మల్ని కలువలేకపోయాం. ఫోన్ నంబర్ ఇవ్వండి. ఇంటికి చేరుకోగానే బేబీతో ఫోన్ చేయిస్తా" అని గురునాథం అడగగానే

తనకు నా ఫోన్ నంబర్ ఇచ్చేశా. తాను వెళ్లిపోగానే. నా డ్యూటీ నుండి ఇంటికి వెళ్లి సులోచనతో గురునాథం కలిసిన విషయం చెప్పా. ఆ విషయం విని తాను కూడా ఎంతో సంబరపడిపోయింది. తాను కన్న బిడ్డకోసం తపించినట్టుగా నందిత ఫోన్ కోసం చకోర పక్షిలా ఎదురు చూడసాగింది. సులోచన.

ఎంతైనా ఆడ మనసుకదా. అనురాగానికి ఆప్యాయతకు పొదరిల్లు అమ్మే (ఆడదే) కదా..

–దారం గంగాధర్
సెల్:9848384777

## పండుగంటే!

పండుగ కళ పచ్చగా పరిమళించే
ప్రకృతి ఒడి సడిలో
ప్రతి ప్రాణినీ ఊపుతుంది
ధరిత్రి ఊయల.....
నదులూ,సముద్రాలూ
అడవులూ కొండలూ....
అమ్మ అవని ప్రేమలో
జగమంతా కోవెల...
ఆ వనరులూ వసతులూ
దోపిడీకి గురియై
శ్రమజీవుల చెమటంతా
పెద్దలింటి సిరియై....
ఆకలి కేకలు ఒక చోట
సంపదలన్నీ ఒక బాటైతే
ఎలా అవుతుంది పండుగ...
ఆ సంబరాలూ ఆ సంతసాలూ
ప్రతి ఇంటి ముంగిట
ముగ్గులైతే పండుగ...
నేతలు పలికే మాటలు
నేతి బీరలౌతుంటే
అన్నదాతల బతుకంతా
వెతల దారి బలి అవుతుంటే
ఔతుందా ఇది పండుగ...
పరుచుకున్న ప్రకృతి గుడిలా
ప్రతి గడపా
ఆనందం కొలువైతేనే కద
సిసలైన అసలు పండుగ..

–వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

## నేను...మీ వాన్నే.....!

ఔను !.....
నేను ముక్కోపినే !
మహా పాపినే !
కాదనను... నేను
అన్య ద్రవ్యాన్ని
వాంఛించ లేదనను
అనురాగాన్ని
అందించ లేదనను
అయితే ఒక మాట.....?
రావణాసురుని వల్లనే కదా
రాముడు దేవుడయ్యాడు.
దుర్యోధనుని వల్లనే కదా
పాండవులు ప్రసిద్ధికెక్కారు.
రాస క్రీడల వల్లనే కదా
రాధా–కృష్ణులారాధ్యులయ్యారు
అహింస కోరిన గాంధీ గారు
హత్యకు గురై
మహాత్ముడయ్యారు
నేను.....!?
పేరు ప్రతిష్ట రావాలని
కీర్తి కిరీటం పెట్టుకోవాలని
సాధ్యమైనంత
సాహసం చేస్తానని
సహించని వాళ్ళ
నోళ్ళుమూస్తానని
ఎవ్వరు ఊహించుకోలేదు
నన్ను ఆదరించక
ముందుకు పోలేరు
ఇంతకీ నేనెవరో తెలుసా ?
పాపానికి మూలాన్ని
దౌర్జన్యానికి ద్వారాన్ని
హింసకు ప్రతిరూపాన్ని
మోసాన్ని–మోసగాన్ని
మీ మనసుల్లో
దాగున్నోన్ని.. మీ వాణ్ని.

–రసస్రవంతి & కావ్యసుధ
9247313488

## మన ఊరు - మన బడి..

అనేక వర్షాలుగా మనూరి
శివారులో జడలమర్రితో పాటు
ఒంటరిగా ఉండి
ఊరిలో జరిగే సంఘటనలకు
సజీవసాక్ష్యంగా నిలిచి..
పసిబాల్యపు పసిడిజ్ఞాపకాల్ని
తన స్మృతిపొదివిలో దాచుకుని
ఎన్నెన్నో తరాల్ని, అంతరాల్ని చూసి
చిలిపి చిన్నారుల్ని
ప్రయోజకులుగా మలిచి
సమాజం ఒడిలో వదిలి..
విజ్ఞానవిత్తుల్ని నాటి
అభివృద్ధితో పొత్తం చేయించిన
మనూరి బడి ఎవరు పట్టించుకోక
నేడు శిథిలావస్థలో
కొట్టుమిట్టాడుతోంది..
ఆదరణ కరువై
నిర్వహణ నిర్లక్ష్యపు బారినపడి
తనను ఆదరించే దరికై
తనను కాపాడేవారికై
వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తోంది..
బీటలు వారిన గోడలు
పగుళ్లిచ్చిన బండలు
ఊడుతున్న పెచ్చులు
కారుతున్న కప్పులు
బైటికి తేలిన సీకులు
పైనుండి వాననీటి లీకులు..
నువ్వు చదువుకున్న బడి
నువ్వాడుకున్న ఆటల మడి
ఆ చదువులమ్మ గుడి
బాల్యపుమధురస్మృతుల జడి
వృద్ధాప్యంలోనున్న ఆ గుండె తడి
నిను పిలుస్తోంది రా రమ్మని..
శిథిలమౌతున్న తన కాయాన్ని
భవిష్యత్ తరాలకై పదిలపర్చమని..
నిర్వహణ లేక రెపరెపలాడ్తున్న
జ్ఞాన జ్యోతిని
తిరిగి వెలిగించమని..

–సర్వరాజ్ అన్వర్
9440981198

## విరుగుట పెరుగుటకే...

వంగి వాలిన కొమ్మరెమ్మల్ని
ఒడుపుగా నరికేస్తేనే కదా
నిటారుగ చెట్టు పెరిగి
ఆకసాన్ని ముద్దాడే
మహోవృక్షమగును !

చిట్టి మామిడికాయ

# 'వేచాను కలకై' అంటున్న.. విజయకుమారి!

పుస్తక సమీక్ష

**"ఆశలు అవసరాలు.. ఆశయాలుగా పరిణమించేది రేపటి విజయ ప్రస్థానం కోసమేనని"** భావించే కవయిత్రి దారల విజయకుమారి గారు తమ మొదటి కవితా సంపుటిని **'వేచాను కలకై'** పేరుతో వెలువరించారు. తిరుపతికి చెందిన కవయిత్రి విజయకుమారి గారు ఈ గ్రంథంలో అరవై కవితలకు చోటు కల్పించారు.

కాస్తదయ. ఉన్నంతలో ఉదారత, ఉపేక్షించే ఔన్నత్యం.. ఇవే నీ ఉనికిని చూపేది అంటూ **'నువ్వో-బుడగ'** కవితను తీర్చిదిద్దారు.

**'ఇల్లాలి ముచ్చట్లు'** కవితలో ముక్కలవుతున్న ఉల్లి కోసం ఆమె రోజూ కంటతడి పెడుతుందనీ... పోపు దినుసులతో పాటు.. ఆమె చిటపటలు ఇంటిల్లిపాదీ ఆస్వాదించే మురిపాలు అని చమత్కరించారు. కవితకు కాదేదీ అనర్హం అని శ్రీశ్రీ పేర్కొన్నట్లు.. విజయకుమారిగారు ఇంటి దర్వాజను ఇలవేల్పుగా అభివర్ణిస్తూ, ఓ కవితను రాసి మెప్పించారు. సంసారనదికి సాగర సమా జానికి వారదై ఇంటి గౌరవాలను కాచే ఇల వేల్పు ఇంటి దర్వాజా అని రాయడం బాగుంది.

**'నిశ్శబ్దం నిద్రించడమే కావాలి'** కవితలో.. కొండంత మౌనం ఎవరికి మేలు!

కీచురాల్లే నయం కద..

చీకటి రాత్రిని దాటిస్తాయి భయ మెరుగకుండా.. గుండె గదిలోని నిశ్శబ్దం గుర్రుగా చూసేలా గోడలు సద్దుచేయడం కావాలనీ.. ఆమెకిప్పుడు ఒకింత సేపు నిశ్శబ్దం నిద్రించడమే కావాలి అంటూ ముగించడం బాగుంది.

మనసుపెట్టి ప్రతిదినం
మల్లెల గీతం విను

నీకూ మనసుందని గుర్తుకొస్తుందంటూ 'మల్లెల గీతం' కవితను తీర్చిదిద్దారు. మల్లెలను మాల కట్టడమంటే.. భావాల దొంతరలను పేర్చడమేనని తేల్చి చెప్పారు.

తలపుల తలుపుల్ని ఎంత భద్రంగా మూసేసుకున్నా.. తడుతూ తోసేసుకుంటూ.. అంటూ కొనసాగించిన పంక్తులు **"అదే గొడవ"** కవితలో చక్కగా ఒదిగిపోయాయి. అల్లరీ తీనే.. ఆరడీతనే ఆరాధించినా.. ఆక్షేపించినా తనే.. దరహాసమూ తనే.. దారి దీపమూ తనే అంటూ ప్రకృతి పురుషుని గూర్చి చక్కగా ఆవిష్కరించారు.

ఇష్టము-కష్టము-దుఃఖము-సుఖము చీకటి వెలుగులు లేకుండా కాలం కరిగిపోదన్న వాస్తవాన్ని కవయిత్రి విడమరిచి చెప్పారు.

నోరు మెదపలేని.. ఆకాశ నిశ్శబ్దం అనాదిగా ఆమె మౌనం- అంగీకారమే కదా!అంటూ **'ఆమె పరాయి'** కవితకు మంచి ముగింపునిచ్చారు. ఆమె జీవితంలో ఆమే పరాయి అయిన వైనాన్ని ఆవిష్కరించిన తీరు అభినందనీయంగా ఉంది.

నిరీక్షణలోని మాధుర్యాన్ని అందమైన ఆలోచనలతో **"నీ రాక కోసం"** కవితను రాశారు. నీ కలల మెరుపుల వళ్ళే నాకు కాస్త ఉపశమనమని చెప్పడం బాగుంది. నీ రాక కోసం చూస్తూ నువ్వొచ్చే దారిలో నా చూపుల పిల్లలను నిలబెట్ట ఎత్తుకొని వచ్చేయ్ అంటూ సఖుని ఉద్దేశించి రాసిన పంక్తులు బాగున్నాయి. 'నా చూపుల పిల్లలు" పద ప్రయోగం చేయడంలో కవయిత్రి ప్రదర్శించడం ప్రశంసనీయం.

మనసును గురించి రాస్తూ కవయిత్రి విజయకుమారిగారు **"మనసుగతి ఇంతే"** కవితను రూపుదిద్దారు. అప్పుడప్పుడు మోసాల విస్ఫోటాలకు గాయ పడుతుం టుంది.. ఏ ఓదార్పు సేవలతోనో మాన్పు కుంటుందని ప్రకటించడం బాగుంది. మనసు మల్లెల పొట్టమనీ.. విప్పితే చాటు పరిమళాలతో చుట్టేస్తుందని చక్కగా కవితను ప్రారంభించారు.

**'మట్టిపాదాలు'** కవితలో రైతన్నను ఉన్నతంగా చిత్రించారు. అతని చెమటతో తడిసిన నేల అతని గొంతై నినదిస్తూనే ఉదంటూ కవితను చక్కగా ఎత్తుకున్నారు. కడుపుకు కన్నీళ్ళు తాగిస్తూ మళ్ళీ కొత్తగా కలల విత్తనాలను నాటుకుంటాడనీ.. సారె సాయం కోసం చేతులు చాస్తాడని వాపో యారు. **"వీరా"** కవితలోనూ అన్నదాత పట్ల కవయిత్రి తమ గౌరవాన్ని చాటుకున్నారు. **"నగర జీవనం"** కవితలో నగర జీవితాలకు అద్దం పట్టారు. ఊరడింపులైనా.. ఓదార్పు లైనా ఎవరికి వారేనని చరవాణి మద్దిస్తాయి. సమూహాలలో ఏకాంతాలుగా నగర జీవనాలు అంటూ వ్యాఖ్యానించారు. వన్నెలద్దిన చల్లని ప్రశాంతత కావాలంటే పల్లెల కోమారు వచ్చి పోవాల్సిదే అంటూ నగర జీవనం కన్నా పల్లె జీవనమే మిన్న అన్న అర్థం ధ్వనించే విధంగా ఈ కవితను తీర్చి దిద్దారు.

అక్షరాల్లో అంతులేని నిశ్శబ్ద ముందనీ.. అగుపించని అగాధ ముందనీ.. గొంతు విప్పితే గోడు వెళ్ళబోసుకుంటాయి. గోల చేస్తే గద్దిస్తాయంటూ 'అక్షరాలు' కవితను రాసి అక్షరాల ప్రాశస్త్యాని తెలియ జెప్పారు. అక్షరాలు పారిజాతాల్లా జారిపడే అందమైన జల పాతాల్లా కనిపిస్తాయనీ.. నిజానికి అక్షరాలు లోలోపలే రగిలే అగ్ని పర్వతాలని అభిప్రాయపడ్డారు.

ఊహల కిరణాల అనుగ్రహం కల అనీ.. కనుపాప జతలో దృశ్యాలను ఒం పుకుంటూ కనురె ప్పల ఒడిలో ఆడుకుం టూ.. అంటూ "కట్టేసుకుంటా" కవితను చక్కని భావుకతతో కొనసాగించారు. చీకటి మది గదిలో దీపం పెట్టి ఎదంతా కలియ తిరుగుతూ కల సందడి చేస్తుందని తెలిపారు. ఆ కలను కట్టేసుకుందుకైనా.. నిదురను నిషేధించనని చెప్పడం బాగుంది.

**'కూలి బిడ్డలు"** కవితలో ప్రకటించిన భావాలు ఆర్ద్రంగా కొలువుదీరాయి. శ్రమైక జీవనాల ఉపాధిపై గుదిబండ కప్పేసింటే.. ఆ పాల బుగ్గలను.. ఆ భావి రత్నా న్ని ఎక్కడని అన్వేషించాలని కవయిత్రి తమ వేదనను వ్యక్త పరిచారు.

సాహితీ కోనలో కలసే పిలగాడు వచ్చిన ప్రతిసారీ.. కవితల తిను బండారాలు తెస్తుంటాడంటూ 'నాకు తెలిసినోడు' కవితను రాశారు.

**'వేచాను కలకై'** కవితలో కవయిత్రి విజయకుమారిగారు కలవరపెట్టే కలలను నిషేధించడం కనుల కెప్పటికీ రాదని తేల్చి చెప్పారు. రాత్రి వికసించిన కొన్నికలల మొగ్గలు.. తొలి వేకువలో ముఖంపైన చిరు నవ్వుల పరిమళాలు అద్దుతాయని అంటూ కవయిత్రి తమ భావుకతను ప్రదర్శించారు.

అలల ఆక్షేపణలున్నప్పటికీ.. తీరం దాటేందుకు త్వరపడుతూ.. కాగితపు పడవలో కలలెన్నో నింపి కాలం కదలికేసి నిలిపే ఉంచుతాను.. ఒద్దుకొస్తే చేరదీద్దా మని అంటూ రాయడం బాగుంది. కవయిత్రి విజయకుమారిగారు ఇలా ఈ కవితా సం పుటి నిండా సరళత్వానికి పెద్దపీట వేస్తూ.. అలతి అలతి పదాలతో అద్భుతమైన భావా లను ప్రకటించారు.

కుమారి ప్రియాంక జాతవ్ గీసిన ముఖచిత్రం గ్రంథానికి నిండుశోభను కూర్చింది..

ఆమె మున్ముందు మరింత గాఢమైన కవిత్వంతో మన ముందుకొస్తారన్న విశ్వాసం ఉంది. కవయిత్రి ఒంటరితనాల కలల లోకం నుండి వాస్తవ లోకంలోకి వచ్చి.. సమాజంలో జరుగుతున్న ఘటనలు.. సంఘటనలకు స్పం దిం చి.. మరింత సందేశాత్మక సమాజ హిత కవిత్వాన్ని అందించాలని ఆశిద్దాం.

**ప్రతులకు:**దారల విజయకుమారి
కే/ఆఫ్ ఈఎస్ఐ హాస్పిటల్, బైరాగి పట్టెడ
అవిలాల రోడ్, తిరుపతి.
సెల్: 91771 92275

**- దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## కంచుకోట నీలాల నింగి

అందాల మందారం
అవనిపైన అంబరం
చీకటి వెలుగుల సంబరం
పగలు రాత్రుల సంబంధం ...

పగలంతా ఊదారంగుతో
పరిమళించి పలకరిస్తూనే?
రాత్రేమో చిమ్మచీకటిని ఆవరించి
చిట్టి వెలుగులు చిలకరించు ....

ఉభయ సంధ్యలలో
కెంజాయ వర్ణాల కెంపులతో
ఒళ్ళంతా పులకరింపజేసి
కళ్లంతా ఆనందాలు నింపు ....

కవ్వములా మనల్ని తిప్పుకుని
కాలాలను పరిచయం చేసి
కనికరిస్తుంది ఎండా వానలిచ్చి
జీవరాశికి కడుపులు నింపుతూ ...
పడిగా వచ్చే వేడి గాలులకు
ధూళి దుమ్ములతో నిండగానే?
దూది పింజముల మేఘాలను
పిండుకుంటూ భూమి బిడ్డకు
తలంటు స్నానాలు చేయిస్తుంది ?

అపార విజ్ఞానాల అంతరంగం?
ఆశగా విసిరిన గులేరు వలలకు
అమ్మగా... గురువై అందిస్తుంది
ఖగోళాల కనువిప్పులు కలుగజేస్తుంది ....

కంచుకోటలోని మంచు బిందువుల
లెక్కలప్పజెప్పి... కాపలాగా రేరాజును
నియమించి కాలగణనాలతో కబాడి
ఆడించి... నాగరికతకే నడక నేర్పింది....

అయినా అప్పుడప్పుడు పిల్లచేష్టలే?
కోతిమూకల్లాంటి పిల్లలతో
చేతులు కలిపి చిలిపి ఆటల్లో
మునిగి పిడుగుల పిడిగుద్దులతో
సద్దుచేసి బాధలను
బట్వాడా చేస్తుంది...

**-నగునూరి రాజన్న**
8332963129

## తొణుకులు

వసుధైక కుటుంబ కాంక్ష
అతడు భూమికి పుత్రుడు
విశ్వకవిగా పొందె ప్రశంస
స్వర్గానికి తానే వారసుడు...!

అప్రమేయానంద గీతాంజలి
ఎన్నడూ చెదరని శాంతి
ఆధ్యాత్మిక ఆరోహణ సోపానం
జనగణమనతో దేశఖ్యాతి...!

పొలం దున్నే రైతు శ్రమలో
పసిహృదయాల నవ్వుల్లో
పరమాత్మను దర్శించె రాగూరు
నిలిచె జనుల హృదయాల్లో...!

చెట్టు నీడలోనే బోధన
వెలసింది శాంతినికేతనం
చెమటలోనే ప్రభువు దీవెన
ఎగిరింది దేశ జయకేతనం...!

వేసిన సంకెల తెంచారు
వ్యవహార భాషా గొడుగు
వేసారు వెలుగుబాటను
తెలుగు భాషకు గిడుగు...!

సవర భాషకు లిపిని
అందంగా తీర్చినారు వారు
సరికూర్చి సుందరముగా
అందలము ఎక్కించినారుగా...!

అరగంటే నీవు చేసావంటే
అనారోగ్యమును తరుమును
అన్నీ అద్భుతాలే జరుగునోయ్
ఆరోగ్యసిద్ధి కలిగించును...!

మెదడు పనితనం పెరుగు
ఏకాగ్రతను పెంచును యోగా
ఎముకలకు పుష్టి కలుగు
అలవాటుగా చేయి బాగా...!

వెలుగులు వెదజల్లే వెన్నెల
చలువలు పంచునందరికీ
వెతలు మరపించే వెన్నెల
శాంతిని చేకూర్చునందరికీ...!

వెన్నెల్లో విరబూసిన విరులు
నీలిమేఘాల తేలే జాబిల్లి
వెలది కనులలో వెలుగులు
దోబూచులాడే వెన్నెల చల్లి...!

గురజాడ గేయాల బాట
నండూరి వారి ఎంకి పాట
గుమ్మపాలోలె కమ్మనైన భాష
చిలకమర్తి హాస్యపు మాట...!

పద్య ప్రత్యేకత కలిగినది
విశ్వనాథ విరితేనెల తేట
పలు ప్రక్రియల వెలుగునది
దేవులపల్లి కమ్మనైన పాట...!

గురువు మార్గదర్శకుడు
విలువైన విద్యను బోధించును
గుణములందు ఆదర్శమై
విద్యార్థులను తీర్చిదిద్దును...!

ఉపాధ్యాయుడు ఉత్తముడైయుండి
ఆదర్శముగా ప్రవర్తించవలె
ఉన్నత విలువలు బోధించాలి
ఆచరణలో చూపవలె...!

గోవర్ధనగిరినెత్తినాడు
ఆబాలగోపాలాన్నలరించె
గోపికలనాటపట్టించినాడు
ఆనందమును కలిగించె...!

తులసీదళములకే తూగె
కర్మయోగమును బోధించె
తులలేని గీతను అందించె
ధర్మసంస్థాపన గావించె...!

జానుతెనుగు పలుకులతో
పద్యాలతో హృద్యమైనది
జావళీల రసఝరుల
పలుకుల తీయదనం కలది...!

అవధానాలతో ప్రశస్తమై
త్యాగయ్య రాగాల రంజిల్లునది
అజంతా భాషగా ప్రత్యేకమై
కమ్మని కావ్యాల రాజిల్లునది...!

ఆపన్నులను ఆప్తులను
కరుణతో కనికరించు
ఆదరించి చేయూతనివ్వు
మానవతతోడ స్పందించు...!

మాటల లేపనం పూయవలె
నేనున్నానంటూ ధైర్యాన్నివ్వాలి
మానసికస్థైర్యం నింపవలె
ఆత్మవిశ్వాసాన్ని కలిగించాలి...!

అందనంత ఎత్తుకు ఎదిగేలా
అజ్ఞాన తిమిరాన్ని తొలగించు
అ ఆ లు నేర్పిన పంతులే
చక్కని పునాదిని ఏర్పరుచు...!

తప్పులను సరిదిద్దువాడు
మానవత్వ విలువలు నేర్పును
తప్పొప్పుల తెలియజెప్పువాడు
మానసిక స్థైర్యం కలిగించును...!

అక్షరము లోకరక్షితం
ఆత్మరక్షణ ఆయుధము
అక్షరము శక్తిసమన్వితం
ఆత్మవిశ్వాస సాధనము...!

పరదేశాన గౌరవం పెంచు
అక్షరకీర్తి అక్షయము
పరుల చెంత పరువు కాచు
అక్షరసిరి శాశ్వతము...!

దోసెడు నీళ్లతో పెరుగును
వృక్షమును నీవు సంరక్షించు
దోసిళ్లకొద్దీ ఫలములిచ్చును
కలకాలం నిన్నది రక్షించు...!

పరోపకారమే పరమావధి
ఇవ్వడమే తప్ప తీసుకొనిది
పదితరాలకు నీడ తరువు
నీ అవసరాలను తీర్చేది...!

ఏకదంత గజాననుడు
విఘ్నములను తొలగించును
ఏకవింశతి పత్రిపూజతో
విద్యాజ్ఞానమును ప్రసాదించును...!

ఆరోగ్యమును ప్రసాదించును
పండుగలో పరమార్థమున్నది
ఆనందమును కలిగించును
ప్రకృతి పరిరక్షణ ఉన్నది...!

జలము జీవులకు ప్రాణాధారం
వృథా చేయకు నీటిబొట్టు
జలమే జీవక్రియలకాధారం
వర్షం నీటిని ఒడిసిపట్టు...!

నీరుంటేనే మనును జీవులు
మంచినీరు ఉన్నది కొంచమే
నీరుంటేనే సాగును బ్రతుకులు
తలచుకొంటే పొదుపు సాధ్యమే...!

బాల్యమెంతో మధురమైనది
అల్లరిగా ఆటల్తో గడుపుతూ
బాధ్యతలు అంటని ఆనందంతో
అలసి అమ్మఒడి చేరుతూ...!

కల్లాకపటం తెలియదుగా
తల్లిదండ్రుల కలలదీపాలు
కమ్మని మాటల చిలుకలుగా
బాలలు రేపటి పౌరులు...!

కలహాలు కార్పణ్యాలు మానుదాం
పేరుకు ఏదైతేనేం మతం
కలిసికట్టుగా కలిసుందాం
మనిషికి మానవత్వమే హితం...!

కలలు కంటే సరిపోదు
కృషి పట్టుదల ఉండాలి
కలవరిస్తే కల నిజం కాదు
ఋషిలా తపస్సు చేయాలి...!

దేశమంటే మట్టికాదనెను
సంఘసంస్కర్త గురజాడ
దేశమంటే మనుషులని చాటె
అభ్యుదయానికి అడుగుజాడ...!

ముత్యాల సరాల రూపకర్త
కులమత భేదాలను కూల్చెను
ముదితల జీవన సంస్కర్త
పూర్ణమ్మలకు వెలుగు చూపెను...!

నిరంతర ప్రయత్నం చెయ్యి
గెలుపోటములు దైవాధీనం
నిశ్చయముగా అడుగులు వెయ్యి
ప్రయత్నమన్నదే నీ ఆధీనం...!

పరోపకారార్థమిదం శరీరం
కష్టసుఖాల మిశ్రమం జీవితం
పరమార్థం సాధించుటే లక్ష్యం
కాదు జీవితము శాశ్వతం...!

శుభకార్యాలకు దూరం విధవ
నవీనుల్లోనూ మూఢవిశ్వాసాలు
శుభము కాదట ముఖదర్శనం
తొలగించుకోవాలి చాదస్తాలు...!

భార్య మరణిస్తే పునర్వివాహం
పాతుకుపోయిన దురాచారాలు
భార్యకు మాత్రమే ఎందుకు...?!
నిరసించాలి మహిళలు...!

భార్య మరణించిన పురుషుని
చూస్తే అపశకునం కానిది
భావనలో సైతం స్ఫురించనిది
విధవెదురైతే ఎలా అయింది...?!

జీతం లేని పనిమనిషి
చిరుప్రాయంలోనే వైధవ్యం
జీవితానందమెరుగని ఋషి
నడుమనే వీడిన బాంధవ్యం...!

చేయని తప్పుకు శిక్షలెందుకు...?!
వివక్షనెదిరించి గెలవాలి
చేదు అనుభవాలు సమసి
సమాజంలో గౌరవం పెరగాలి...!!!

పాటే తన శ్వాసగా బ్రతికిన
నిండైన మానవతామూర్తి
పాటగా మిగిలిన గాయకుడు
గాయకులందరికీ స్ఫూర్తి...!

పదహారు భాషల్లో గానం
బాలు స్వరప్రస్థానం అవిరళం
పసిపిల్లవాని హృదయం
నవరసాలొలికించిన గళం...!

అవమానాలెన్నో భరించి
ఛీత్కారాలెన్నో దిగమింగెను
అస్పృశ్యతను సహించెను
సత్కారాలెన్నో అందుకునెను...!

ఆలయప్రవేశానికనర్హుడై
ఖండకావ్యాలెన్నో లిఖించె
ఆవేదనతో ×గబ్బిలం× రచించె
విశ్వనరునిగా ఖ్యాతి గాంచె...!

కష్టాలే వ్యక్తిత్వ పరీక్షలు
జీవిత పయనంలో ఎదురైనా
కష్టాన్ని ఇష్టంగా మార్చుకుని
విజయతీరం తప్పక చేరనా...!

ఆనంద సందర్భాల త్యాగం
చలిలో ఎండలో సైనికులు
ఆశయాల సాధనే లక్ష్యం
హాయిగా నిదురలో ప్రజలు...!

ఆటంకాలెన్ని ఎదురైననూ
తొణకని గాంధీజీ తత్వం
ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపం
మేరుశిఖర మూర్తిమత్వం...!

సత్యసంధతే ఆదర్శంగా
అహింసే ధర్మమన్న గాంధీజీ
సత్యాగ్రహ సాయుధుడైన
స్వాతంత్ర్య యోధుడు బాపూజీ...!

ఒక్క రూపాయి జీతబత్తెంతో
నీతికి ప్రతిరూపమైనాడు
ఒక పూట భోజనం మాని
పేదలకై పాటుపడినాడు...!

నిబద్ధతకు నిలువెత్తు రూపం
పొట్టివాడైనా గట్టివాడు
నిజాయితీకి స్వచ్ఛ దర్పణం
ప్రపంచ శాంతికి కృషిచేసాడు...!

తేనెటీగ నుండి శ్రమతత్వం
నేర్చుకుంటే ప్రకృతి పాఠము
తేనె కొరకు చేసే ప్రయత్నం
నేర్పుతుంది జీవన సత్యము...!

నీవంటే ఏమిటో తెలుపు
ముగింపులో ఉండేవి జ్ఞాపకాలే
నీదైన ముద్రను నిలుపును
పరులకొనర్చిన సహాయాలే...!

కలిసి ఉంటే కలదు సుఖం
సుఖమన్నది ఉండు సంతోషంలో
కలిమి ఊసే వలదు దానిలో
బాధైనా సౌఖ్యమే భావనలో...!

అనురాగంతో అల్లుకున్న బంధం
ప్రేమ నిండిన సదనము
అడుగకనే పొందిన వరం
భువిలో వెలసిన స్వర్గము...!

మరెక్కడో లేదు మనశ్శాంతి
ఎక్కడో వెదికి వేసారకు
మనసులోనే దాని ఉనికి
కోపతాపాలకు గురిచేయకు...!

మానవులంతా మైత్రి కలిగుంటే
మతవిద్వేషాలు మాయమగును
మారణహోమాలు సమసిపోవు
మహిలో శాంతి పరిఢవిల్లును...!

అల్లర్లను అణచివేసి
విభేదాలను రూపుమాపాడు
అధికారబలాన్ని ధిక్కరించి
ఐక్యతాప్రతిమై నిలిచాడు...!

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా
ఉద్యమాలను నడిపినాడు
ప్రజల ప్రగతికై పాటుపడి
భారతరత్న కిరీటమైనాడు...!

తెరపై వెలిగేది కొందరే
కరతాళధ్వనులన్నీ వారికే
తెరమరుగున ఎందరెందరో
శ్రమఫలితం దక్కంది వారికే...!

చరిత్రకెక్కే నిజాలు కొన్నే
బయటపడని త్యాగాలు ఎన్నో
చరితార్థులయ్యేది కొందరే
బలి అయ్యే బ్రతుకులు ఎన్నెన్నో...!

ఆత్మనూన్యతను కలిగించకు
ఇతర పిల్లలతో పోల్చవద్దు
ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేయాలి
మార్కులే కొలమానం కావద్దు...!

అందరూ మేధావులే కాలేరు
ఎవరి ప్రతిభ వారిదే
అందరికీ మొదటి స్థానం రాదు
ప్రత్యేకత ఎవరిది వారిదే...!

పరదేశంలో గౌరవం తెచ్చేది
సంస్కారం ఉన్నప్పుడే రాణిస్తుంది
పరులు దొంగిలించలేనిది
వినయంతోనే విద్య శోభిస్తుంది...!

ఆసక్తికి తగ్గ చదువు
వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది
ఆత్మవిశ్వాసం పెంచే చదువు
మేలైన భావికి బాట వేస్తుంది...!

దివిలోని దేవత దీవెనలా
మంచుపూల వాన మనోహరమే
దినదినమూ చేసే పోరాటంతో
సైనికుల విధి సాహసమే...!

శీతలదేశాన కురిసిన
మంచు తుంపరలలో తడిసితి
శీతల తుషార బంతి మలిచి
మనవరాలి చెంత మురిసితి...!

కోనేట తారాడే చిరుదివ్వెలు
వెలుగుతూ వెచ్చదనాన్నిస్తూ
కోటి తారలతో పోటీగా
కిరణాలతో ప్రకాశిస్తూ...!

ఆరోగ్యసిరి ఉసిరి నీడన
వనభోజనం ఆరోగ్యప్రదం
ఆహార నియమాలతో కూడిన
కార్తీకమాసం శుభప్రదం...!

అరవిరిసిన పూ మల్లెలు
కురిపిస్తారు నవ్వులను
అమాయక పలుకులతో
పెనవేస్తారు బంధాలను...!

కనిపించేవన్నీ వింతలే
అల్పమైనవే అమూల్య ఆస్తులు
కళకళ్లాడుతూ ఇంట తిరిగే
సిరులొలికే చిన్నారులు...!

నవ్వుతూ నలుగురినీ నవ్విస్తూ
బరువు బాధ్యతలు నిర్వర్తించు
నలుగురికీ సాయం చేస్తూ
బతికినన్నాళ్ళూ జీవించు...!

ఉరుకులు పరుగుల జీవితం
ఆందోళనలు ఒత్తిడులతో
ఉన్నత స్థితి కోసం ఆరాటం
ప్రత్యర్థిపై పోటీ పరుగులతో...!

అచ్చతెనుగు అక్షరాలు కూర్చె
లలిత పదాల దేవులపల్లి
అలరించె పాటలను అందించి
భావకవితల పాలవెల్లి...!

విశ్వంభరతో వచ్చె జ్ఞానపీఠం
అయ్యారే భళారే సినారె
విఖ్యాతిగాంచిన తెలుగు కవి
ఎంత చక్కగా రాసినారె...!

అలసిసొలసి వచ్చినా
ఆదరణతో అలరించును
అలసటతో వాలిపోక
పనులన్నీ చక్కబెట్టును...!

పెదవి కదపకుండానే
మనసు తెలుసుకొనును
పెదవంచున నవ్వుతోడ
సమస్యలను పరిష్కరించును...!

సెల్లును చేతబట్టి వారు
చుట్టుపక్కలసలే చూడరు
సెల్ఫీలు దిగు ముచ్చటలో
ముందరున్న మృత్యువును కనరు...!

చిత్ర విచిత్ర చేష్టలతో
వింత భంగిమలను చూపుచూ
చిత్తమొచ్చిన రీతిగాను
ఛాయాచిత్రమును తీయుచూ...!

ఆశ్వయుజ బహుళ తదియన
చక్కని వరుని రాక కొరకు
ఆడపిల్లలు నోచే నోము
కుజదోష పరిహారం కొరకు...!

వెలదులకు వాయనమిచ్చి
ఆటపాటలతో ఆనందించేరు
వెన్నెల్లో ఊయలూగుతూ కన్నెలు
దినమంతా హాయిగా గడిపేరు...!

నింగిన వెలిగే ఆకాశబంతి
పసిడి వర్ణపు చేమంతి
నిండుగా వెదజల్లు వెన్నెల
చలువ కలిగించు చంద్రకాంతి...!

మబ్బుల్లో దోబూచులాడుతూ
అలరించే అందాల జాబిల్లి
మనసును మురిపిస్తుంది
తారల నడుమ తారసిల్లి...!

సమాజానికి హానికారకం
ధూమపానం ప్రక్కవారికి చేటు
సర్వనాశనానికి నాంది
మద్యపానం కుటుంబానికి కాటు...!

చిత్తు చేస్తోంది మత్తు యువతను
మంచి అలవాట్లు చేసుకోవాలి
చిత్తభ్రమల్లో తేలియాడిస్తుంది
దృఢచిత్తంతో దూరంగా ఉండాలి?!

ఆశేగా మనిషికి శ్వాస
దురాశ దుఃఖమునకు చేటు
ఆశకు అంతనేది లేదుగా
అత్యాశ మనుగడకే కాటు...!

పట్టుదలతో ప్రయత్నించు
లక్ష్యాన్ని గాలికి వదలకు
పట్టుపట్టి పని సాధించు
ప్రయత్నం మధ్యలో విడువకు...!

చిగురంత ఆశాభావంతో
సమస్యల సుడిగండాన్ని దాటు
చిరునవ్వులతో సాగుతూ
నిరాశపై వేయుము వేటు...!

చిరునవ్వుల స్వాగతంతో
పలకరింపు పన్నీరు చల్లితే
చిగురించును మైత్రీబంధం
పదిలంగా దాన్ని కాపాడితే...!

అజ్ఞానాన్ని తరిమేసే అక్షరం
తిమిరాన్ని తొలగించే దీపం
అక్షరజ్ఞాన తేజస్సుతో
వెలుగులు వెదజల్లును రూపం...!

అక్షరం తోడుగా నిలువుకో
విజ్ఞానమే వెలుగునిచ్చును
అజ్ఞానం తొలగించే దీపమది
వినయం తోడైతే ప్రకాశించును...!

ఆహారమేగా ఔషధము
లేనివారికి తిండే దొరకదు
ఆడంబరాలకై వృథా తగదు
ఉన్నవారికి తింటే అరగదు...!

అన్ని దానముల కన్న మిన్న
వృథా చేయకుము ఆహారం
అన్నదాత శ్రమఫలమది
అన్నార్తులకు పంచితే ఆనందం...!

మనసులోని భావనలేగా
చేతలలో తేటతెల్లమయ్యేది
మనసులోని కల్మషమే
లోకమంతా వెదజల్లబడేది...!

మనసులో మాలిన్యం తొలగించు
మానవత్వ సుగంధం వెదజల్లు
మహిలో మనీషిగా జీవించు
ఆయురారోగ్యాలతో వర్ధిల్లు...!

ఆమె సహనం అవనికున్నంత
ఓర్పుకు నేర్పును జోడిస్తుంది
ఆమె ఆత్మస్థైర్యం అనంతం
అడ్డంకులన్నీ దాటిస్తుంది...!

అంతరంగంలో కుములుతున్నా
నగుమోము ఆమె నైజము
అందరినీ కలుపుకుంటూ సాగే
ప్రేమ మమతల ప్రతిరూపము...!

ఆత్మీయతనందించే తోబుట్టువు
ఆదరించు వరాలకొమ్మను
ఆటబొమ్మగా భావించకు
అలుసు చేయకు ఆడపిల్లను...!

**-చంద్రకళ. దీకొండ**
చరవాణి:9381361384

# అందరు చదువదగిన అనువాద కావ్యం...!

పుస్తక సమీక్ష






సమయం కంటే ముందున్న ఈ నేల, ఓ గిప్ప నాగరికత జ్ఞాపకాల్లో పవిత్రమైందని భావించే విశ్వ ప్రసిద్ధకవి.. ఒడియాంగ్ల ద్విభాషా కవితా స్రష్ట.. పద్మ విభూషణ్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సీతాకాంత మహాపాత్ర.. "భరతవర్షం" పేరుతో ఒక దీర్ఘ కవితను రాశారు. గుండె భరణిలో ఒక చిన్నకలగా రూపుదిద్దిన ఈ దీర్ఘ కావ్యంలో.. సీతాకాంత మహాపాత్ర ఆయన కలలకు, ఆశలకు, క్రోధానికి, వ్యథకు ఈ పుస్తకాన్ని వీలునామాగా తీర్చిదిద్దారు. స్వర్గంలో జీవించాలని, దాని నరకంలో నేను మరణించానంటూ.. అదే ఆయనకు ప్రియమైన ప్రేమ.. సన్నిహిత శత్రువు అని భావిస్తూ.. తొమ్మిది సర్గాలలో 'భరత వర్షం' దీర్ఘ కవితకు రూపమిచ్చారు. వృత్తిరీత్యా ఐ.ఏ.ఎస్. ఆఫీసరుగా స్వదేశ, విదేశాలలో ఉద్యోగ జీవితం కొనసాగించినప్పటికీ.. వీరి కవితాంతరగం సుందర సుమంగా పరిమ ళాలను గుబాళించడం విశేషం! సీతాకాంత మహాపాత్రగారి ఇంతటి మహోన్నత కావ్యాన్ని తెలుగులోకి అనువాదం చేసిన ప్రముఖ కవి ముకుంద రామారావుగారు అభినందనీయులు.. 'భరతవర్షం' కావ్యాన్ని తెలుగు సాహితీ ప్రియులకు అందించడం కోసం ముకుంద రామారావుగారు అనువదించడం అభినందనీయం.. భారతీయ కవిగా అందరి అభిమానాలను చూరగొన్న సీతాకాంత మహాపాత్రగారి 'భరతవర్షం' యొక్క హృదయావిష్కరణ చేసి తెలుగు పాఠకులకు ఆ కావ్యంలోని మధురిమలను.. జ్ఞాపకాలను.. అనుభూ తులను పంచడంలో ముకుంద రామారావు గారు సఫలీకృతులైనారు. అచంచల దీక్షా తపస్విగా.. ఉత్తమ అనువాదకుడిగా భాసిల్లుతున్న ముకుందరా మారావు గారు ఇతర భాషల నుండి రచనలను తెలుగులోకి అనువాదం చేయడంలో అనుభవాన్ని కలిగి ఉన్నారు.

భారతీయ కవుల్లో సీతాకాంత మహాపాత్రగారి స్వరం ప్రముఖ మైందని భావించే ముకుంద రామారావుగారు సీతాకాంత మహా పాత్ర సమస్త యాతనల మధ్య మానవ అస్తిత్వపు వేళ్లూనిన సంతోషం కొద్దిగానైనా కోరుకుంటూ, కవిత్వం ప్రత్యామ్నాయ వాస్తవికతను సృష్టించ గలదన్న విశ్వాసాన్ని వీరి కవిత్వ కలగ జేస్తుందని చెప్పడం వల్ల 'భరత వర్షం' కావ్యం యొక్క గొప్పదనాన్ని.. మహాపాత్ర యొక్క రచనా వైచిత్రిని మనం ఇట్టే గ్రహించగలం..

ఈ దీర్ఘ కావ్యంలోని తొమ్మిది సర్గాలలో వివిధ అంశాలను ఆలోచనాత్మకంగా ఆవిష్కరించినట్లు ముకుందరామారావుగారి అనువాదం ద్వారా మనం తెలుసుకోగలం..

మొదటి సర్గంలో 'ఆవాహన' శీర్షికతో రాశారు. అమెరికా ప్రభుత్వం తమ భూమి కొంటున్నప్పుడు, దస్తావేజు మీద సంతకం చేస్తూ సియాటల్ అధ్యక్షుడు ప్రకటించిన భావాల వెలుగులో మొదటి సర్గంలో 'ఆవాహన'కు సంబంధించిన అంశాలను పొందుపరిచారు. ఇక్కడ ఇప్పటి ఈనేల నాది.. రాబోయే జన్మల్లో కూడా నాదేనని తేల్చి చెప్పారు. మొదటి సర్గంను మూడు భాగాల్లో విశ్లేషించారు. యుగ యుగాల ఇతివృత్తం ఇది అనీ, కలలాంటి ఆకారాన్ని పటం మీద గీయడం కష్టమనీ.. ఈ దేశం చరిత్ర కాదు.. నాకు ఓ తల్లిలా కనిపిస్తుందని దేశం పట

పుస్తక సమీక్ష

# హృదయాలను కదిలించే కథలు

మాన్యం రమేష్‌కుమార్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయులు. క్లాసులో విద్యార్థులకే కాదు, సాహితీ ప్రపంచంలోని పాఠకులకుకూడా పాఠాలు చెబుతారు. ఆచి, తూచి కథలు రాస్తారు. ఆసక్తికరమైన, విజ్ఞానదాయకమైన సంగతులనెన్నింటినో పాఠకులు కూడా విశదీకరిస్తారు. దశాబ్దంన్నర కాలంలో వందకుపైగా కథలు వ్రాసి పలు బహుమతులు పురస్కారాలు అందుకున్నారు.

ఇంగ్లీషు మరియు పొరుగు రాష్ట్రం ఒరియా సాహిత్యం అధ్యయనం చేసిన వీరికి మార్కుట్వయిన్ అభిమాన రచయిత.

పాఠకుడిని చివరి వరకూ ఆసక్తికరంగా చదివింపచేసి, చదివాక ఒక మంచి అనుభూతిని మిగిల్చేదే మంచి కథ అంటారు. తన కథల్లో ఈ అనుభూతిని మిగల్చటంలో కృతకృత్యులయ్యారు. ఒక పనిలో గాఢమైన 'తదాత్మత' పొందటమే గొప్ప 'ధ్యానం' అంటారు.

సంపుటిలో 16 కథలున్నాయి. మంచి తనాన్ని, మానవత్వాన్ని పెంపుచేయాలన్న ఉద్వేగం కథల్లో ద్యోతకమవుతుంది. 'నటన' అన్నది స్టేజి మీద నుండి ఎదుటి వీక్షకులకు చూపెడితే సంతోషిస్తారు. ఎంతబాగా నటిస్తే, అంత ప్రశంసలు, కరతాళ ధ్వనులు దక్కుతాయి. నిజ జీవితంలో అందునా, భార్యాభర్తల మధ్య నటన, సహజత్వం లోపించిన కృత్రిమత, ఎన్నో రోజులు నిలవ్వు అని చెబుతారు 'అతడు ఆమె ఇతడు ఈమె' కథలో. కథ ముగింపు బావుంది.

"ఎవడైనా మనల్ని డబ్బులడిగితే వాడు నిజంగా డబ్బవసరంలో ఉన్నాడో లేదో.. మనకు తెలీదు. కాని అన్నం అడిగినవాడు మాత్రం ఖచ్చితంగా ఆకలితో ఉన్నాడని గ్రహించు. వాడికి ఏదో ఒకటి పెట్టకుండా పంపించకు "అన్న సత్యాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మి, ఆచరించి, సాటి వారి యెడ మానవత్వం ప్రదర్శించే శేఖర్ (ఖాళీ-కథ) తన ఆఫీసుబాస్ ఆనంద్ తనని అర్థ: చేసుకోకున్నా ఫరవాలేదు. మరో మంచి వాక్యం ఈ కథ చివర్లో 'జీవితంలో కొన్నిసార్లు కొన్ని పన్లకి సంజాయిషీ ఇచ్చుకోవటం చాలా కష్టం. అలాంటి సమయాల్లో మౌనాన్ని ఆశ్రయించటమే మేలు. కథ ముగించినా పాఠకుడు కథలోంచి బయటకు రాలేడు. రచయిత చెప్పని మరో పది వాక్యాలను ఊహించుకోక తప్పని పరిస్థితి కల్పించుతాడు రచయిత. సోమేపల్లి సాహితీ అవార్డు పొంది కథ ఇది.

వృద్ధాప్యం శాపం లాంటిది. అందునా 'సోషియల్ సెక్యూరిటీ'లాంటి సౌకర్యాలు లేని మన దేశంలో మరీ దారుణం!' బ్రతికున్నంత సేపూ,విసుక్కుంటూనే ఉంటుంది ఆ కోడలు. ఒక మంచి మాట మాట్లాడదు. మామగారికి తృప్తినిచ్చే పనులేవీ చెయ్యదు. కాని ఆయ న చచ్చాక కనబర్చే శ్రద్ధ, మామగారి అభిరుచులను మూడోరోజు కర్మనాడు తప్పక తీర్చాలన్న తపన, కోడలి పట్టుదల గమనించిన భర్త హరికే కాదు, చదువుతోన్న పాఠకులకు కూడా 'ఉక్కపోత' కలిగిస్తుంది. (నాన్నా.. క్షమించు..)




నలభీమ పాకాలు తయారుచేసి భోక్తలను మెప్పించే నేర్పు కలిగిన సారంగ మామయ్యకు ఇష్టమైన వంటకం ఏమిటి? అన్న ప్రశ్నవేసిన అల్లుడి ప్రశ్నకు జవాబు దట్టమైన అడవిలో గిరిజనుడు వడ్డించిన వేడి వేడి గంజి అన్నం, చుర్రుమనిపించే మిరపపచ్చడిలో దొరికింది (మామయ్యకు నచ్చిన భోజనం!!?) ఆ కొన్న కూడే అమృతం' అని ఆనాడే సుమతి శతకకారుడు చెప్పాడు.

ఆయనో సీనియర్ సిటిజన్. కొద్దిపాటి వినికిడి శక్తి కూడా నశించిపోయింది. రోజంతా పూర్తి నిశ్శబ్దంలో బ్రతకటం కష్టమైపోయింది. ఆపరేషన్ చేయాలంటే యాభయివేలు కావాలన్నాడా డాక్టరు. కోడలు ఉదారతతో తన నెక్లెసు కుదువబెట్టి అప్పు ఏర్పాటు చేసింది. వస్తుందో రాదో తెలియని వినికిడి కోసం డబ్బు వృధా చేసికోవటం, టెన్షన్ పడటం అనవసరం అనిపించిందాయనకు. డాక్టరుతో చిన్న అబద్ధం చెప్పించి ఆపరేషన్ ఆపుచేయించాడు. నిశ్శబ్దం తో రాజీ పడ్డాడు. సంపుటికిచ్చిన టైటిల్ కథ 'నిశ్శబ్దం' కాలమాన పరిస్థితులను బట్టి ప్రాధాన్యతలను నిర్ణయించాలని చెబుతుంది.

కాలంకాటుకి కలుషితం కాని, అన్నదమ్ముల మధ్య అనుబంధం గమనించాక, రాత్రి కురిసిన మంచుకి నేలంతా చెమ్మగిలినట్లు, పాఠకుల మనసులు ఆర్ద్రతతో తడిసిముద్దవుతాయి.

నేటి కాలంలో మనిషి తన స్వార్థ పరత్వంతో అడవుల్ని నరుకుతున్నాడు. నగరీకరణ రోడ్ల విస్తరణకు తాను పెంచిన చెట్లనే తాను నరుకుతున్నాడు. రిపేరు షాపు అప్పలస్వామికి రోడ్డు వారన ఉన్న బాదం చెట్టు అతి ముఖ్యమైనది. జీవితంలో భాగమయింది.

రోడ్డు విస్తరణలో భాగంగా ఆ బాదం చెట్టుని నరకాల్సి వచ్చింది. విస్తరణ కార్యక్రమం ఆపలేని అప్పలస్వామి మరోబాదం మొక్కను నాటి శ్రద్ధగా పెంచుతాడు. పర్యావరణాన్ని ప్రేమించమని, పెంచమని సందేశం ఇచ్చే గొప్ప కథ! గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయాలు తప్పక ఉంటాయని సూచించే ఆశావాదం.

రమేష్‌గారి కథల్లో మనుషులే కాదు, చీమల్లాంటి చిన్న చిన్న ప్రాణులు కూడా ఉంటాయి. అవి మనుషుల కంటే గొప్పగా ప్రవర్తిస్తూ మమ్మల్ని చూసి మీరు ఎంతో నేర్చుకోవల్సి ఉందని చెబుతాయి (చీమ). చివరి ఘడియల్లోని రోగి మానసిక స్థితిని 'అంతిమ సత్యం' బాగా చెబుతుంది. ఏదో బాముకుందామని భర్తను కొడుకును విడిచి లేచిపోయింది. పై మెరుగులు కరిగిపోగా కొడుకు దూరం కాగా ఆమె పరిస్థితి 'రెంటికి చెడ్డ రేవడ' అయింది. క్షణికావేశాలకు పోవద్దని, కాలం విధించిన కట్టుబాట్లే సమాజ సంక్షేమమని చెప్పే కథ 'వర్షం కురుస్తూనే వుంది'. బాధితురాలి ఆలోచనల్ని వేదనని ప్రకృతిలో ప్రతిఫలింపచేసిన తీరు బావుంది.

'డాక్టర్‌మూర్తి @ డిగ్రిటాస్' అనే కథ 'యుథనేషియా' (స్వచ్ఛంద మరణం)కు మరో కోణం. ముందుకాలంలో ఇలాంటి సౌకర్యాలు (?) వచ్చినా ఆశ్చర్యం లేదు. 'వర్టిగో' అనే జబ్బు శరీరంలో 'ఇమ్‌బాలెన్స్'కి సంకేతం. ఇలాంటి వర్జిగో' మనుషుల జీవితాల్లో ఉంటే ఇవ్వాల్సిన ట్రీట్‌మెంటు ఈ కథలో సూచించారు రచయిత. 'విజ్ఞానంకంటే ముఖ్యమైనది ఊహాత్మకత' అన్న ఐన్‌స్టీన్ కొటేషన్‌ని ఉటంకిస్తూ రాసిన సైన్సుఫిక్షన్ "బుద్ధిజీవులు". తెలుగులో సైన్సుఫిక్షన్ సాహిత్యం అవసరం ఎంతో ఉంది. ఆ లోటును పూర్తిచేసే ప్రయత్నం ఈ కథగా భావించవచ్చును.

ప్రముఖ కథకులు గంటేడు గౌరునాయుడుగారు తన ముందు మాటలో చెప్పినట్లు "అంతస్సంఘర్షణల చిత్రణ, పరిశీలనాశక్తి ఈ కథల్ని ఆసాంతమూ ఆసక్తితో చదివేలా చేస్తాయి".

**ప్రతులకు:** రమేశ్ కుమార్
ఇ.నెం. 28-160,
దేవాంగుల స్ట్రీట్
నెల్లిమర్ల-535 217
9492454678
8558899478

**- కూర చిదంబరం**
సెల్: 8639338675

## నీతిమాట..!

నీతిలేని బ్రతుకు నిశ్చల శవమేను
ఇచ్చురీతి కూడ యింపుకాదు
ఇచ్చువారువున్న చచ్చువారొత్తురు
లంచమడుగువాడు లబ్ధికొరకు!

బ్రతుకుమంచిదైన బహుకీర్తివచ్చును
పరిమళించుచూడ పరమజయము
నీతిలేనివాడు కోతిసమముకాదు
నడతరీతి చెడగ నంగ నాచి!

పరులసొత్తుకొరకు పరితపించవలదు
మంచిబుద్ధి కాదు మనిషి కిలను
కష్టమందుగల్గు కలిమి చూడగమేలు
తరుల తత్త్వమెరుగు ధరణిలోన!

ఇరుగుపొరుగుతోడ యింపుగానున్నను
ఖ్యాతిపెరిగి మమత కరుణపెరుగు
ఇచ్చుపుచ్చుకొనెడి యిచ్ఛయెంతోమేలు
స్నేహ భావమనెడి శీలమబ్బు!

నీతిదప్పి బ్రతుక నియతినే కోల్పోవు
కష్టపడినకాని కలదు యశము
ఆడిదప్పరాదు నవనిలో నెప్పుడు
మంచిమాట వల్ల మహిన వెలుగు!!

**-శ్రీమతి చింతోజు పద్మావతి**
8464954860,

## నానీలు

మానుకు
మర్మాలుంటాయి
పరిశీలించి చూడు
నర్మగర్భం.

పుడమి
పులకరించింది
విత్తనం
పురుడు పోసుకోవడంతో

కవి కలం
కథం తొక్కుతోంది
మరో శ్రీ శ్రీ
పుట్టుక కోసమేమో !

ఎన్ని పూలను
మాలలుగా అల్లను
దారం
సాలీడు పోగైనపుడు

**-కయ్యూరు బాలసుబ్రమణ్యం**
9441791239

## ఆనందం వెల్లివిరియాలి

స్వార్థం మానుకో
సాయం పెంచుకో
సహనం పాటించు
ప్రశాంతతను సాధించు
ఆవేదనలు వదులుకో
అనురాగాలు పెంచుకో
ఆత్మీయతను పంచుకో
కోట్ల కోసం కుస్తీలు
ఆస్తుల కోసం ఆరాటాలు
అధికారం కోసం పోరాటాలు
క్రూరత్వం కుటిలత్వం
కుయుక్తులు కుట్రలు మానుకో
సిరిసంపదల కంటె
గుణ సంపద మనిషిని
మహోన్నతున్ని చేస్తుంది
విలువలే మనిషికి
నిజమైన ఆభరణాలు
భౌతిక సంపద కన్న
మానసిక సంపదే మిన్న
మనిషి విజ్ఞాని
మానసికంగా అజ్ఞాని
సంస్కారం లోపించి
సహనం నశించి
అహం ఆవరించి
ఆందోళన ఊబిలో
కూరుకుపోయి
ఆగమై ఒంటరైపోతున్నడు
ఆశలపై అదుపు
మమత మానవీయత
పరోపకారంభూతదయ
సమన్వయంసహకారం
సంఘీభావంజీవనశైలికావాలి
అసూయ వద్దు
అనురాగమే ముద్దు
సద్గుణాల వ్యక్తిత్వమే
అసలైన ఆనందానికి మూలం
ఆనందంధనసంపధ వల్ల రాదు
గుణసంపదవల్ల వస్తుంది
వ్యక్తిత్వంవికసిస్తే
ఆనందంవెల్లివిరుస్తుంది

**-నేదునూరి కనకయ్య**
9440245771

పుస్తక సమీక్ష

# పరిమళభరితం దత్తశర్మ పద్య కావ్యం

పండితులు, శతావధాని శ్రీ పాణ్యం లక్ష్మీనరసింహ శాస్త్రి, శ్రీమతి లక్ష్మీనరసమ్మ వరపుత్రులుగా జన్మించి, ఇంటర్మీడియట్ విద్యాశాఖలో లెక్చరర్ గా, ప్రిన్సిపాల్ గా, డిప్యూటీ సెక్రెటరీ గా, రీడర్ గా బాధ్యతలు నిర్వహించి అందరిచేత సమర్థుడు అనిపించుకున్న పాణ్యం దత్తశర్మ గారు తండ్రికి తగిన తనయులుగా రచనలు చేస్తూ,ఎ.జి.ఆఫీసు రంజని వారిచే పద్య కవితకు "విశ్వనాథ పురస్కారం' 'మొదలు కొని మరెన్నో బహుమతుల నందుకున్న సాహితీ మూర్తులు. విభిన్నమైన కొత్తదనంతో కూడిన శీర్షికలతో రచనలు చేయడం వీరి ప్రత్యేకత. వీరి కథలు కొన్ని కన్నడ భాషలోకి అనువాదం చేయబడి పత్రికలలో ప్రచురించబడినాయి. వీరి నవల"సాఫల్యం" 'సంచిక ' అంతర్జాల మాస పత్రికలో ప్రస్తుతం ధారావాహికంగా వస్తుంది. తొలి రచనగా చంపకాలోచనమ్ ఖండ కావ్యంతో మన ముందుకు వస్తున్న పాణ్యం దత్తశర్మ గారిని సహృదయంగా ఆహ్వానిద్దాం.

దేవతలు ప్రార్థనలతో కావ్యమును ప్రారంభించు సంప్రదాయమును అనుసరిస్తూ గణాధిపుడితో పాటు సరస్వతి తదితర దేవతామూర్తులను స్తుతిస్తూ భిన్నమైన అంశాలతో విభిన్నమైన పథంలో చక్కని ఖండకావ్యాన్ని సాహితీ లోకానికి అందిస్తున్న దత్తశర్మ గారు అభినందనీయులు. శ్రీ గురు దత్తుని పంచరత్నమాలతో అలంకరిస్తూ గురుదత్త సేవా ప్రభావాన్ని సమున్నతంగా వివరించారు.తిమిరమును దునుము దివ్యతేజముగా,శారద మానవ రూపంగా, సమసుదర్శన దివ్యయోగపు సౌఖ్యములందించు వాడిగా గురువును పరిచయం చేస్తూ,అంతర్లీనంగా తనకు విద్యగరిపిన గురువులను స్మరించుకున్న తీరు ప్రశంసనీయం.

''ఆరున్నొక్కటి కొండల/ గారుణ్యము తోడవెలసి కలుషహరుడై/వరములనెఱ గురిపించెడు/ సిరిమగనికి జోతలిడుదు స్థిరచిత్తమునన్ "అంటూ ఏడుకొండల వాడిని పాడియావు, తేనెటీగ, మేఘము, తల్లి పక్షిగా ఊహిస్తూ, సకల జనులను పోషించు నీదు వైభవము మాదేయని తమదిగా భావించిన తత్త్వము అమోఘము.''నరసింహుని పెండ్లి'', "సింహవాహిని! శర్వాణి!శివుని రాణి!", "మోక్షకాంక్ష", " శ్రీ లక్ష్మీనరసింహ కరావలంబ స్తోత్రములు" మోక్ష సాధనకు భక్తియొక్కటే మార్గమని, అరిషడ్వర్గాలకు, పంచేంద్రియాలకు చిక్కినవారి జీవితాలకు భగవంతుని శరణమే కైవల్య ప్రాప్తి నొసగునని మధురభక్తిని మధురమైన పద్యాలతో మన ముందుంచిన దత్తశర్మ గారి పద్య దత్తతకు నమస్సులు.

"కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రీ,

భోజ్యేషు మాతా, శయనేషు రంభా షట్కర్మ యుక్తా కుల ధర్మపత్నీ''. యని,''అపురూపమైనదమ్మ ఆడజన్మ,ఆ జన్మకు పరిపూర్ణత ఇల్లాలమ్మ "అని స్త్రీలను పాటల్లోను,మాటల్లోను గౌరవిస్తున్నాము.కాని స్త్రీ మనోగతాన్ని,ఆమె ఆలోచనల్ని మనం గౌరవిస్తున్నామా?ఎప్పటికీ ఇది ప్రశ్నగానే మిగిలిపోతుందా? "చంపకాలోచనము" సగటు మగవాడిని ప్రశ్నిస్తుంది? గృహిణి నిర్వహిస్తున్న బాధ్యతలను,భరిస్తున్న బాధలను ,వహిస్తున్న సంయమనాన్ని గమనిస్తున్నామా?మహిళలు అర్థభాగమని చెప్పడం కాదు...సంసారంలో ఇరువురం సమానమే..బండికి ఇరు చక్రాలమే అనే భావన కలిగిననాడు సంసారం స్వర్గసీమయే కదా..లోకమంతా నిత్యకళ్యాణం పచ్చతోరణమే కదా...స్త్రీలు కోరుకునేది ఆస్తులు అంతస్తులు కాదు..వారు కోరుకునేది.తీయని పలకరింపు,అనురాగంతో పలుకు మాట వారికి పసిడి మూట.అదే వారికి ప్రేరణ.. లాలనతో పలుకు లాలిత్యపు వాక్కులు "రవరవలేక మమ్మునను రాగముతో నొక మాట పల్కినన్ పవలును రేయి మిమ్ము కనుపాపల బెట్టుకు కాచుకుందుమే'' ఈమాత్రము మగవాడిగా మనము అందించలేమా? ప్రతి మగవాడిని ఆలోచింపజేసే "చంపకాలోచనము"చదివిన మగవారిలో మార్పు తెస్తుందని ఆశిద్దాం.

కందపద్యవైభవాన్ని "కొందరు చెప్పంగ లేరు కోవిదులైనన్"అంటూనే కందములో చందనము చల్లినటుల కందపద్యం గొప్పదనమును విశదపరచడం ప్రశంసనీయం.

నేడు మనం అనుభవిస్తున్న కలుషిత పర్యావరణం స్వయం కృతాపరాధమే. మానవుడు తన సుఖసంతోషాల కోసం చేసిన కర్మల ఫలితమే. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు నినాదం నినాదంగా మిగలకుండా అటు ప్రభుత్వం ఇటు ప్రజలు పచ్చని భారతంకై కృషి చేయవలసిన అవసరాన్ని "తరువే బ్రతుకు తెరువు" ప్రభోదిస్తుంది. "తరుహీనంబైనప్పుడు/ సుర లోకంబైన నిత్య శోభలబాయన్''అన్న ఒక్క పాదము తరుప్రాధాన్యతను, మన కర్తవ్యాన్ని తేటపరచింది.

ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా పేరొందిన మన తెలుగు భాష అక్షరమువలె నిరతము జనుల నాలుకలపై నర్తించునని "జాను తెనుగు గెలువజాలు భువిని"లో స్పష్టపరచినారు.

మానవులు సాధించిన సాంకేతిక విజ్ఞానం మానవ కళ్యాణం కొరకే అన్నది నిర్వివాదాంశం.కాని మనిషి ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే తీరులో దాని ప్రభావముంటుంది. చరవాణి దూరంగా ఉన్న మనుషులను దగ్గరకు చేసిందని ఆనందపడినాము. కాని అది బంధాలను దూరం చేసింది. యువకులను వక్రమార్గం పట్టించింది. వ్యసనంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో ఫార్వార్డులు,అభూతకల్పనలు, మోసాలు,




అంతర్జాల దుర్వినియోగాలు..వీటన్నింటికీ కారణం...మంచికి వినియోగించక చెడుకు వాడుకునే మన మనసు. కత్తి కూరగాయలు కోస్తుంది,కుత్తుకలను తెగ నరుకుతుంది.తప్పు సాంకేతికత విజ్ఞానంది కాదు..సరిగ్గా దాన్ని వినియోగించుకోలేని మనదని గుర్తించాలని సమాజ హితం కోరి పాఠకులకు అందించిన"సామాజిక మాధ్యమ వధ్యశిల" అద్వితీయం.

"మాతా!తవ వందనమ్" భరతమాత పట్ల కవికి ఉన్న మాతృభక్తిని ప్రకటిస్తుంది. తెలంగాణ సాధనకై ఉద్యమించిన తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త ప్రొ.జయశంకర్ ను కవి స్మరించుకోవడం సముచితం. జ్ఞానపీఠమెక్కిన పుంభావ భారతి, అక్షర స్థవతి, తెలుగువాడి గొప్పదనాన్ని నలుదిశలా చాటించిన విశ్వంభరుడైన "రాశిని,వాసిని అరరే!కలరే నీ సరి!ఓ సినారె!'' యని దివికేగిన కవితారుధిని "ఓ సినారె!నీ ప్రతిభకు జోహారే!"లో ప్రస్తావించడం ముదావహం.

ఆధునికత,అద్భుతమైన సాంకేతికత సాధించుకున్న నేటి సమాజంలో ఇంకను స్త్రీలపై అత్యాచారాలు జరుగుట శోచనీయము. అత్యాచారములకు పాల్పడే "మగ మృగములకున్ అంగచ్ఛేదనమె తగును అందరు మెచ్చున్" అంటూ...

"యుద్ధపు విద్యల నేర్చుచు/సిద్ధపు మిరియాల పొడిని శీఘ్రత జల్లన్/కృద్ధత మగ రాక్షసులను/పద్ధతిగా మట్టు బెట్టు" మని బాలికలకు చక్కని సందేశాన్ని అందిస్తూ ''బాలికా రక్షణమ్'' ద్వారా చక్కని మార్గదర్శనం చేశారు.

మనిషి చివరి మజిలి మరణమని అందరికీ తెలిసిన విషయమే.కాని అంతకన్నా మించిన మరణం సందర్భాలెన్నో జీవితంలో ఎదురౌతుంటాయి. అలాంటి సందర్భాలను "క్రమమృత్యువు"ఖండికలో కవి మానవులకు సుబోధకంగా అర్థమయ్యేలా పొందుపరచడం అభినందనీయం.

వేకువ ఝామున ప్రకృతిలో కన్పించు సుందర దృశ్యములను,ఎగురుచున్న పక్షులను,మట్టిదారులలో పయనించు రైతులను ,కాపు పడుచులను కాన్వాసు పై వేసిన చిత్రమువలె అద్భుతమైన కవనముతో మనముం దుంచుతూ, సదా తాను చూసే అదృష్టం తనకు కల్పించిన విశ్వనా థునికి కృతజ్ఞతాస్తుతులు సమర్పించ డం కవి హృదయస్పందనకు గీటురాయిలా నిలిచింది.

తేజోమూర్తులు, జాతి నిర్మాతలు, మహనీయుల విగ్రహాలను చౌరస్తాలలో నిలిపినంత మాత్రమున దేశభక్తి ప్రకటితమవదు. వారి ఆశయాలను,లక్ష్యాలను నెరవేరుస్తూ ప్రజలకు హితకార్యములు చేయుటయే దేశభక్తికి నిదర్శన మని "బొమ్మలా?బొధనలా?'' శీర్షికన బొమ్మలు ప్రతిష్టించడం కాదు, బోధనలను అమలుపరచడమే లక్ష్యం కావాలని బోధించడం కవి అంతరంగంలో దాగిన సునిశిత దృష్టికి నిదర్శనం.

"విరోధాభాసం"కావ్య ఖండికలో సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ఉన్నవి ఉన్నట్లుగా ,నిర్భయంగా, నిశ్చయంగా వ్యక్తీకరించే ప్రయత్నం చేశారు.

మౌనం అర్థాంగీకారమంటారు. కాని మౌనం కొన్నిసార్లు గొప్ప గొప్ప సమస్యలను దూరం చేస్తుంది.అట్లని అంతటా మౌనం వహించుట తగదని కూడా కవి హెచ్చరించాడు. మానవ హక్కుల హననంలో, అన్యాయాక్రమాలు జరిగినపుడు వ్యతిరేకతను ఎలుగెత్తి చాటవల సిందేనని ఉటంకించారు.

శ్రీ శ్రీ కాదేది కవితకనర్హం అంటాడు.నిజమే...కవిత్వానికి ప్రకృతిలోని ప్రతీదే వస్తువే అన్నది వాస్తవం.నిత్యజీవితంలో మనం కొన్నింటికి అలవాటు పడుతుంటాం..ఉదయం లేవగానే కాఫి/టీ తో పాటు దిన పత్రిక చదవందే రోజువారి జీవితం ప్రారంభం కాదు. అలాంటి దిన పత్రికలను చదివిన తర్వాత కొనేవాడు వీధిలో"పాత పేపర్లు కొంటాం"అని అరుస్తూ వెళ్ళడం మనం నిత్యం గమనిస్తుంటాం.పాత పేపర్లు కొనడానికి వచ్చిన ముదుసలితో తన అనుభవమును ఒక కావ్యముగ మలచి శ్రమైక జీవన సౌందర్యమును మనకు విశదపరచిన కవిపుంగవుడు మన దత్తశర్మ గారు. వారి దయార్ద్ర హృదయమునకి దొక మచ్చుతునక. చక్కని శీర్షికలతో,రమ్యమైన పద్య కవిత్వంతో నిండిన ఖండకావ్యము సాహిత్యాభిమానుల హృదయాలను గెలుకుంటుందని ఆశిస్తూ....

-ప్రతులకు:
ఇంటి నెంబర్ 5-4-481/1,
ప్లాట్ నెంబర్ 20,రోడ్ నెంబర్ 1
ఆంధ్రకేసరినగర్, వనస్థలిపురం
హైదారాబాద్
95502 14912
మరియు నవోదయ బుక్ హౌజ్
కాచిగూడ ఎక్స్ రోడ్స్ హైదారాబాద్

**-డా.వైరాగ్యం ప్రభాకర్**
90145 59059

## నీరే ప్రాణాధారం

జలముకన్నమిన్న జగతిలో లేదురా
ప్రాణులంతటికిని ప్రాణమూదు
జలములేకయున్న జగతియే శూన్యమౌ
తెలిసి మసలుకొనుము తెలివితోడ.

జగతి పైన జలపు జాడలుడుగుచుండె
మేలుకొనక పోతె మెతుకులేదు
ముందు తరము కొరకు పొందుగా మనమంత
కృషి ని సల్పవలెను ఋషుల వలెను.

నదియె దేవతయయ్యి నడయాడి భువిపైన
కన్నతల్లి వలెను గాంచుచుండె
కనుక రక్షణమున కాపాడ మనమంత
కదన మట్లు మనము కదలవలెను.

చినుకు కురిసి నేల జిలుగుకాంతులతోడ
పసిడి పంట నిచ్చి బ్రతుకుజూపె
తెలుగు జాతి వెలుగు తేజమ్మె కృష్ణమ్మ
పాడుకొనుము పాట పరవశముగ

మిషను కాకతీయ మిషను భగీరథ
ప్రాణదాతయయ్యె వనమునిల్పి
పాలమూరులోన వలసలాగగ నేడు
సమయమింతలేక సాగె రైతు

నిండి చెరువులన్ని నిండు చంద్రునిలె
వసుధ విల్లసిల్లె పల్లెలందు
మురిసిపోయి పల్లె ముత్తైదు రూపమై
గొప్పకీర్తి పంచె కూర్మితోడ.

పల్లెపచ్చగుండు పారెటి నీళ్ళున్న
ధనమునిండునింట ధాన్యసిరుల
వృద్ధి నొందు జగతి వనరుల సమకూర్చి
పల్లెసీమకిదియె పట్టుచీర

**-మల్లెకేడి రామోజీ**
6304728329

## స్వర్గ లోకం... నరక కూపం...?

ఎక్కడున్నాయి ?
స్వర్గ లోకాలు...నరక కూపాలు...
ఎవరు చూశారు ?
స్వర్గ ద్వారాన్ని...నరక కూపాన్ని...
అన్నీ అవన్నీ ఈభూమి మీదనే కాదా ?
నిత్యం మనం అనుభవించడం లేదా ?

మన కళ్ళకు కనిపించవు కదా
ఏ కష్టనష్టాలు...ఏ సుఖదుఃఖాలు
సుఖమే స్వర్గమని...దుఃఖమే నరకమని...
ఈ మట్టిమనిషికి అర్థమయ్యేదెప్పుడో?

మన ఆనందమే మనకు స్వర్గమని...
మన వ్యధ ఆవేదనే మనకు నరకమని...
ఈ మట్టి మనుషికి జ్ఞానోదయమయ్యేదెప్పుడో?

మన చిరునవ్వే స్వర్గమని...
మన చింత చీకటే నరకమని...
ఈ మట్టిమనిషికి కనువిప్పు కలిగేదెప్పుడో?

ఏ మొండివ్యాధి సోకో
ఏ హాస్పిటల్లో బెడ్ మీదనో
ఏ ఐసీయూలోనో ప్రాణభయంతో
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై పోవడమే నరకమని...

ఇంట్లో పిల్లాపాపలతో
ఉల్లాసంగా...ఉత్సాహంగా
విందు...వినోదాల్లో మునిగి
సంతోష...సంబరాల్లో తేలుతూ
హాయిగా...ఆనందంగా...సరదాగా
ప్రశాంతంగా...జీవించడమే స్వర్గమని...
ఈ మట్టిమనిషికి అర్థమయ్యేదెప్పుడో?

కళ్ళకు గంతలు కట్టుకున్న
మాయా ముసుగును కప్పుకున్న
అజ్ఞానాంధకారంలో మునిగివున్న
ఈ మట్టిమనిషికి ఈ సత్యం అర్థమయ్యేదెప్పుడో ?

ఔనిదినిజం నవ్విస్తే...నరకమైనా స్వర్గమౌతుంది
ఔనిదిపచ్చినిజం ఏడిస్తే...స్వర్గమైనా నరకమైపోతుంది

**-పోలయ్య కవి కూకట్లపల్లి**
9110784502

## ఒక ఎండా కాలపు దాహం

ఈ వేసవి కాలం
దోసిళ్ళ లోంచి క్షణాల్ని ఒంపుకుంటూ
గొంతులోని తడిని ఎగరేసుకుపోతూ
ఎండను రాల్చుకుంటుంది .

ఇంటిలోంచి కళ్ళు బయట ఆరేస్తే చాలు
పిల్లలు మూగిన ఐస్ క్రీం బండి
బాధ్యత రెక్కల్ని విప్పుతుంది .

కన్నీటి దుఃఖాల్ని
లోలోపల ఆరేసుకుంటుంది .

ఇంటి లోపల ఉతికిన
వస్త్రాల్ని చూస్తే చాలు
బయట ఎండలో
వయసు భారాన్ని లెక్కచేయని
ఇస్త్రిరి పెట్టి ముసలివాడు
బొగ్గుల నిప్పుల్లోంచి జీవితాన్ని చూపిస్తాడు .

ఎండ పేలిపోతున్న
బండి కదలదు .

శ్వాస ఆగిపోతున్న
బతుకు పోరాటం ఆగదు .

చూపులు తిప్పుకుని
నీటి టబ్బు వైపు చూస్తే చాలు
గడపలో నీటి కోసం కాకులు
ఊగుతుంటాయి.
నీట మునుగుతుంటాయి .

ఒక ఎండా కాలం నీటి స్పర్శ కోసం
గొంతులు మధన పడుతుంటాయి .

నా చుట్టూ ఎండను తీసి
గొడుగులా కాసి
ఒక్కో గొంతులో నీటినిపోసి
స్వచ్ఛంగా స్వేచ్ఛగా
పక్షిలా బతకాలనుంటుంది .

ఒక ఎండాకాలపు దాహం
మనిషిని కాల్చకుంటే ఎంతబావుణ్ణు.
చినుకునై కురిస్తే ఇంకెంత బావుణ్ణు .

**-గవిడి శ్రీనివాస్**
7019278368/9966550601

## రుధిర భూమి

బలవంతుడు బలహీనుడిపై
నరమేధ దాడి
చిన్న దేశాల్ని పెద్ద దేశాలు
ఆక్రమిస్తున్నాయి
ఆసుపత్రులు పరిశ్రమలు నగరాలు
నేలమట్టమై అభిశంసనం
కాళ్లకు కత్తులు కట్టి
కోడి పందాలాడినట్టు
అవనిపై విధ్వంసాల సృష్టి
కురుస్తుంది బాంబుల వర్షం
యుద్ధనేపథ్యంలో
అభంశుభం తెలియని పిల్లలు
ఆకలిగొన్న వృద్ధులు
కూటికోసం కాలు బయటపెడితే
తలలు మిస్సైల్స్‌కు ఆహారమవుతున్నాయి
మానవాళి సంబంధం తెగిపోయి
ఒకరినొకరు వెతుక్కుంటూ
ఆహుతౌతున్నారు
అంతా రుధిర భూమి
క్షతగాత్రుల రక్తం తాగి
పుడమితల్లి కన్నీరు మున్నీరవుతోంది
ఈ మారణహోమం చూడలేక
భగ్గునమండే భానుడు సైతం
మబ్బుల చాటున దాక్కున్నాడు
ప్రశ్నించాల్సిన ప్రపంచం
నోటికి తాళం వేసుకుంది
కదనాన్ని ఆపాల్సిన లోకం
కన్నులు మూసుకుంది

**- పేరూరు బాలసుబ్రమణ్యం**
98492 24162

# ముంబైలో ఘనంగా ఉగాది వేడుకలు

'ది బొంబాయి ఆంధ్ర మహాసభ అండ్ జింఖాన' కార్యవర్గ సభ్యులతో ముఖ్య అతిథి డా॥ఏనుగు నరసింహారెడ్డి.



ముఖ్య అతిథి డా॥ఏనుగు నరసింహారెడ్డిని సత్కరిస్తున్న వాసాల శ్రీహరి, పోతురాజాం, సంకు సుధాకర్



యెల్ది సుదరర్శన్ పద్మశాలిని సత్కరిస్తున్న అతిథులు.

రాష్ట్ర వ్య

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 492వ రోజు 'దోమ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'కరివేపాకు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా... -సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిర్గి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

## హంస కుటీరం

తడికి తోడు
రోగికి సరిజోడు
దోమే దోస్త్
నిదురించే వేళలో కుస్తీ.
మురికిలో మురిసి
రివ్వున ఎగిరి
జుయ్యున శబ్ద మోత
కర్ణ కఠోరంగా
రంగ రంగా
పురపాలికలను
మేలుకొలుపు శరవేగంగా.
ప్రయోగాలు బోలెడు
ప్రయోజనాలు కుదేలు
దోమల ఆవాసాలన్నీ
మనుషుల అపరిశుభ్రతల చర్యలే
తనది కాదని తప్పించుకునే చేష్టలే
ప్లాస్టిక్ వ్యర్థాల నిలువలు
మురుగు కాల్వలనిండా అడ్డుగోడలు
జిబజిబమనే దోమల స్వైరవిహారం
చిన్నలకూ పెద్దలకూ ప్రాణసంకటం
చెత్త రీసైక్లింగ్
మురుగునీరు శుద్ధీకరణ కేంద్రాల
నిర్వహణ
ఆదిలోనే హంస కుటీరం
సదీమతల్లులకూ నీటితావులకూ
పద్మోద్భవ పల్లవాల పరిచయం
గ్రామాల్లో పట్టణాల్లో
పరిశుభ్రతను పెంచే
పటిష్ట కార్యక్రమాలు.
ఓ పచ్చనాకు
కెంజాయమై నడుద్దాం
పరిశుభ్రతతో
ప్రగతికి బాటలు వేద్దాం

- ఏడెల్లి రాములు

## అనర్థాల దోమ

ఓ దోమా!
ఏమి నీ వయ్యారం
ఎన్నెన్ని ఘోరాలు సృష్టిస్తున్నావు
మానవుడి రక్తమే
ఆధారంగా బతికే నీవు
మాకే విపరీత కష్టాలు కలిగిస్తున్నావు
ఒకసారి డెంగ్యూ అంటావు
మా శరీరాన్ని పిప్పి చేస్తావు
ప్రాణాంతకపు వ్యవహారం చేసి
ఆస్తులకే ఎసరు పెడతావు
మలేరియా అంటావు
మతిపోయే విధానంతో
ఆదాయంలో కోత చేస్తావు
అసలు అణువంతున్న నీవు
మాపై దాడి చేయడంలోని
మతలబేమిటో!
ఆరోగ్యంకోసం
ప్రాణప్రదంగా చూసుకొనే
మా ఆస్తిపాస్తులు హరించడమేమిటో
మాకు అర్థంకాక
విధిబలీయమైనదికదా!
అనిపించకమానదు
నీ విషయంలో....
దోమా!
నీకో దండం!.

-కళ్యాణి

## దోమకాటు

చిట్టి చిలకమ్మా!
అమ్మకొట్టిందా!
లేదు!
దోమకుట్టింది
అమ్మ కొడితే ప్రేమ ఉంటుంది
దోమ కుడితే రోగముంటుంది
దోమా!దోమా!
నువ్వుబుల్లి దానివే
ప్రాణాంతక వ్యాధుల్ని మోసుకొస్తావ్
మొందిదానివి
పొగలు పెట్టినా
మందులు కొట్టినా
గెలుపు నీదే
నీ ఆయువు తక్కువే అయినా
చేసే బీభత్సమెంతో
మలేరియా, డెంగ్యూ
మెదడు వాపు వ్యాధులన్నీ
నీ చలవే..
నీకు ఆవాసం
కలిపించేది మేమే
పీడనకు గురయ్యేది మేమే..
కుట్టే దోమా
గీ పెట్టే దోమా
కుట్టేనొప్పి తెలీకుండా
సంగీతం వినిపిస్తావు
నీ సంగీతం కర్ణ కఠోరం
అయినా వినక తప్పదు.
దోమ ప్రసక్తి
సర్ రోనాల్డ్ రోస్ ప్రసక్తి
మలేరియా కారకజీవిని
దోమలో గుర్తించి
మలేరియా నిర్మూలనకి పునాది
నిరంతర పరిశోధన
సంచలనాత్మకఆవిష్కరణం
హైదరాబాద్ నగరంలో పరిశోధన
దోమలు లేని నగరం
ఆయనకీచ్చే నివాళి.

-మోటూరి శాంతకుమారి

## ఇంటా బయటా దోమలే దోమలు

పల్లవి: దొంగలాగ చొరబడి
దోమవయ్యి వచ్చావు
నా ప్రేమ గులాబీలు
నీతోనే పంచానే
చెలి ఓ గిలీ
నా ప్రేమ సవ్వడి
ప్రియంవదా నాలోని తాకిడీ //దొంగలాగ//.

చరణం1: రాత్రంతా నిద్రబట్టరానీయవు
తెల్లవార్లు పదపదమంటూ నిలిచావులే
నా ప్రేమ నీదయి
నా మనసే నిలిచెనూ
ఆ దోమ నీవయి
నాలో చేరావే
తకిటతోం తకిటతోం
తదిగిమి తదిగిమి
రాగంతో పాటలు అల్లావే // దొంగలాగ//.
చరణం2: కన్నుఎదుట నిలిచావు
కంటినిండా నీవయ్యి
మాయదారి మంచమేదో
తల్లడిల్లి నిలిచెనేమో
జవరాలి వలపులతో
జానపదుల గీతమై
నువ్వు నువ్వూ నా మనసే
యదలోపల నిలిచినావే
నామనసే ఊయలూపగా
నీవే నాదరి చేరావే // దొంగలాగ//

-వి.సంధ్యా రాణి

## ముసుగేసిన దోమలు

అదో షట్పాది!
షడ్రుచుల్లో ఏ రుచో తెలియదు...?
ఆ నెత్తుటికే రుచి మరిగింది
అందుకేనేమో నెత్తికెక్కిందిప్పుడు...!
జీవుల్లో ఉచ్ఛ స్థితి మాదని ఉరుకులాడిన
జవజీవాల్ని జుర్రేస్తుంది.
రోగాలతో జతకడుతుంది
మహారాజులమని విర్రవీగిన వారిని
మంచం ఎక్కిస్తుంది.
మనాదిలో ముంచేస్తుంది.
సందు దొరికితే చాలు
సంకల్లో దూరేస్తుంది.
ఏమరుపాటైతే చాలు
ఎగురొచ్చి మరీ పీల్చుతుంది.
సోమరిపోతుతో సోపతి
ఊసులు తోడిన కళ్ళతో ఊసులు
వాహకాలుగా వాయనాలు
సర్వవ్యాపితం
వాయువులే వాహనం,
అయినా.....
అది ఏ పాపం ఎరుగని క్రిమి
ఆహారం కోసమే దాని వేట
అడుగడుగున అవాంతరాల కోట
కోట దాటి కుట్టిన క్షణం...
కాల యముడయ్యే వాటం!
అధికారం కోసమో
ఆస్తుల కోసమో
ఆనందం కోసమో
అనుభవించడం కోసమో
ముసుగేసిన తిరుగుతున్న
మత్తెక్కిన దోమలు
మదమెక్కిన దోమలు
నొప్పి తెలియకుండా
నెత్తురు తాగే దోమలు
మన మధ్యే ఉన్నాయి
జాగ్రత్త సుమీ...!!!

- ఉప్పల పద్మ

## వ్యాధిరహిత జీవనం

నిలకడగా నీరు
అక్కడే దోమలు
మన రక్తాన్ని పీల్చేస్తూ దోమలు
మగ దోమలయితే వాటి బ్రతుకు వాటికే
చెట్లు గడ్డి నుండి రసాలను పీలుస్తూ జీవనం
ఆడ దోమలకు మన రక్తమే ఆహారం
ఉష్ణమండల ప్రాంతాల్లో విహారం
బోదకాలు మలేరియా
చికున్ గునియా వ్యాధుల వ్యాప్తి
వ్యతిరేక పోలిక లోనూ
హస్తి మశకాంతర భేదంగా పోలిక
నవజీవన పథంలో ఘనమైన జీవితం
గుడ్డుతో జీవనచక్రం ఆరంభం
కీటకంగా జీవనం పరిసమాప్తం
చేసే ఘనకార్యం
వ్యాధికారకాల పరివ్యాపనం
దోమల నివారణ నేడొక అప్రతిహత చర్య
నీరులేని జీవనవిధానం వారానికోరోజు
దోమల జీవితచక్రానికో జీవితపు కుదుపు
బోదకాలు వ్యాపిస్తే జీవితకాల శిక్ష
సర్ రోనాల్డ్ రాస్ కృషి మలేరియా
నివారణలో
పొగే దోమలవ్యాప్తి నిరోధకం నేడు
దోమలను నిరోధిద్దాం
వ్యాధి రహిత జీవనాన్ని
గడుపుదాం!.

- లక్ష్మా రెడ్డి పసుల

## నీపని సరి!

దో బూచులాడు ఓదోమా!
మనిషిని మాబాగాఏడ్పించేవు!
తెల్లవార్లూ గీగీ అని రాగాలతో
మాబుర్రకి ఎంచక్కా పిచ్చిపట్టించేవు!
ఫాన్ కప్పుకున్న దుప్పటి
దోమతెర రకరకాల మందుల
ఆయుధాలు ప్రయోగం!
హా! నీముందు బలాదూర్!.
మారక్తాన్ని పీల్చేవు!
మలేరియా డెంగీ బోదకాలు తో
జీవితాంతం సతాయించేవు!.
మహాతల్లీ ఆడదోమా!
పదివేల పిల్లల్ని పెట్టే
నీకు ఎంత ఓపికమ్మా!!?
రెండు వారాలే బతికినా
జీవితాంతం సతాయించేవు!.
ఐనా నిన్ను అని ఏంలాభం?
మాస్వయంకృతాపరాధం!
పూలకుండీ నిల్వ నీరు
ఫ్రిజ్జు నీటి ఫ్యాన్ నీఆవాసాలు!
కుళ్ళు చెత్త పోగులు నీకోటలు!
దోమకొండ గ్రామంలో నీపేరున్నకోట!
నృత్యగాన హరికథలతో అలరించే!
ఆకోటను వదిలి మావెంటపడే
నీ పనిపట్టే వారున్నారులే!.
కొత్త అవతార్ టీకా దోమలసృష్టి!
విశాఖ విద్యార్థుల దోమమందు
మొదలైంది నీఅంతం!
దోమల కన్నా పీక్కుతినే
మనుషులను ఎలాతప్పించుకోవాలో
తెలీక పోరాటం ప్రారంభం!.

-ఎ.రాజ్యశ్రీ

## దోమ

ఆ.వె. జగతిలోన జీవజాతుల రీతిగా
పుట్టినట్టి దోమ పొగరు కేమొ
చంప మనిషి జూచు చాలా విధమ్ములు
శత్రు వర్గమయ్యె క్షణముకైన!!.

ఉ. దోమ నివారణమ్ము కని దోపిడి సొమ్ములు కోట్లు కోట్లుగా
క్షేమము పేర వ్యాపకము చింతలు పెక్కు విధమ్ము లేర్పడెన్
ధూమముతో రసాయనము దోషము గా చెడు ద్రావకమ్ములన్
కోమల కీటకమ్ములకు కొంపల పిచ్చిగ ద్వార బంధములే!!

ఆ.వె. చేను చెల్కలోన చెరబట్టు దోమను
పిచ్చికారి జంపు విషముతోడ
దీనమైన దోమ దిక్కుమొక్కును లేక
నేడ్వ సాగె జగతి నింద వలన!!.

చం. ప్రకృతి విలాస ముండి తన వాసపు, స్థానము నిర్మలమ్మునై
వికలము గాక గూడు తగు వేదికలుండగ మానవాళికిన్
సకలము శాంతి వీడగను చక్కగ లేకను కల్మషమ్ముతో
సుఖమును దూరమయ్యెగద జోరుగ నాడెడు దోమకిప్పుడున్!!

ఉ. దోమల దేవత శీతల
భామినికిన్ నెలవు దప్పి భారము పెరుగన్
కామిత భంగపు క్రోధము
ధీమతియయ్యెను కరోన తీరుగ బ్రతుకన్!!

తే.గీ. దోమ కుట్టగ కాటు విద్రోహమనుచు
జ్వరము వచ్చిన రాకున్న జంపు జనులు
దయను వీడిన కఠినులే భయము పడుచు
బెదిరి బ్రతుకుటే శిక్షగా ప్రీతి నిజము !!

-మాడుగుల నారాయణమూర్తి

## దోమల దండు

ఇంటి చుట్టూ పొలాలు
వాటికి తోడు
దగ్గరలో చెరువొకటి ఉంటే
ఇక అంతే సంగతులు...
పచ్చని పైరుతో
పైరగాలి పదనిసలు
చేలగట్లపై నుండి చెంగల్వ పూదండలా
చెంగుచెంగున కదిలే
మట్టితో మమేకమైన రైతు బిడ్డలు.
పొద్దంతా కాపుకాసిన సూర్యుడు
గూట్లోకి వెళ్ళడానికి
పయనాన్ని కొనసాగిస్తున్నాడు..
ఇంతలోనే ఎక్కడినుండో
ఆతృతగా ఆగమాగం వచ్చి
చుట్టూరా ముసురుకుంటాయి
విడువకుండా కొన్ని ప్రాణులు..
ఎంత వదిలించుకుందామన్నా
ససేమిరా అంటూ
దొరకబుచ్చుకుంటూనే ఉంటాయి
ఏనాటి బంధమో!
ఈనాడు కూడా వదలకుండా
కనిపెట్టుకొని కాపు కాస్తున్నాయి..
ఆదమరచి ఉండగానే
కడుపు నింపుకుని కదల్లేని స్థితిలో
గోడలపై సేదదీరుతాయి హాయిగా
పొద్దంతా పనులతో
అలసిన మనసుకు
విశ్రాంతి కోసం నడుం వాలిస్తే
కంటి రెప్పలు అతుక్కుపోయినట్టు
గాఢ నిద్రలోకి జారుకోగానే ..
రెండు రెక్కలను ఆడిస్తూ
విమానంలా ఎగురుకుంటూ
సైరన్ మోతతో చెవి పక్కనే జోరుగా..
కాసేపటికే ఎక్కడో ఒక చోట
ల్యాండ్ అవుతాయి..
ఇక ఏ సౌండ్ రాదప్పుడు
సరిగ్గా అప్పుడే-
డ్యూటీలో నిమగ్నమై
లాగించేస్తుంటాయి ఫుల్లుగా.
అంత నిద్రలోనూ
అవి ఉన్న చోట
చటుక్కున ఒక దెబ్బ అప్రయత్నంగానే
అదృష్టం బాగుంటే
అమాంతం ఎగిరి పరిగెత్తి
మళ్లీ దాగుడుమూతలు
ఆడుతూనే ఉంటాయి..
వాటి ఆట కట్టించేందుకు
ఆలౌటో ఇంకేదేదో కావలసిందే..
లేకపోతే మాత్రం
తెల్లవార్లు మనల్ని
ఆటపట్టిస్తూ జాగారం చేయిస్తాయి
మనిషి నైజం తెలిసిన
మాయలాడులు కొన్ని
మందు బాబులంటే
మరీ చనువుతో మీదనే చేరుతాయి..
కాసేపటికే అవి కూడా మత్తెక్కి
వారిని కుట్టిన చోటనే
సొమ్మసిల్లి పడి ఉంటాయి.
వరి దోమలో
గిరి దోమలో కాని
పొద్దంతా చేనుచెలకలెంటా తిరిగి
రాత్రయ్యే సరికి
ఇండ్లు చేరి
దండుగా మారి దండెత్తుతాయి..

-శ్రీలతరమేశ్ గోస్కుల

# తెలివైన ఆలోచనే విజయానికి వారధి

విద్యార్థులు తాము ఏ రంగాన్ని ఎంచుకున్నా,అందులో ఉన్నతంగా రాణించడానికి విశేష కృషి చేయాలని, మనిషి నేటి ప్రపంచంలో విజయం సాధించాలంటే తెలివిగా ఆలోచన చేయాలి. కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి. విద్యార్థులు సాహిత్యం ద్వారా విలువలు కలిగిన తెలివైన ఆలోచన విధానం పెంపొందించుకోవాలి, తెలివిగా ఆలోచిస్తే ఏ వైకల్యం, పేదరికం , కులం, మతం , డబ్బు ఏది కూడా నీ విజయాన్ని ఆపలేదని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు, ప్రముఖ విద్యావేత్త డా.కూర రామ్మోహన్ రెడ్డి అన్నారు. సుగుణ సాహితీ సమితి మార్చ్ 30వ తేదీ బుధవారం రోజున సిద్దిపేటలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉగాది బాలల కథల పోటీ - 2022 బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఉగాది బాలల కథల పోటీకి మొత్తం 90 కథలు వచ్చాయని, అందులో నుండి 14 కథలను న్యాయ నిర్ణేతల ద్వారా ఎంపిక చేసి విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నామని పోటీల కన్వీనర్ భైతి దుర్గయ్య అన్నారు. బాలల్లో సృజనాత్మక అంశాలను వెలికి తీయడానికి ,సాహిత్య పోటీలు నిర్వహించడానికి సుగుణ సాహితి సమితి మూడు సంవత్సరాల క్రితం స్థాపించామని,బాల సాహిత్య వికాసం కోసం తమ సంస్థ కృషి చేస్తుందని సుగుణ సాహితి అధ్యక్షులు, ప్రవాస భారతీయులు డా.మొసర్ల మాధవరెడ్డి అన్నారు.బాల కథకుల ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని,విద్యార్థులను సాహిత్యం వైపు మళ్లించడానికి సాహితి సంస్థలు తమ వంతు ప్రయత్నం చేయాలని మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి అన్నారు.విజేతలైన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడమే కాకుండా వారిని ప్రోత్సహిస్తున్న 14 మంది ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డా.మర్పడగ చెన్నకృష్ణ రెడ్డి సౌజన్యం తో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని యువ కవి వేల్పుల రాజు సభా సమన్వయం చేసారు. రెండున్నర గంటల పాటు విద్యార్థులను ఆహ్లాదపరచిన ఈ కార్యక్రమంలో బాల కథా రచయిత పెందోట వెంకటేశ్వర్లు,జిల్లా నుండి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# వైరాగ్యంకు కాకినాడ ఉగాది సాంస్కృతిక పురస్కారం

కరీంనగర్ జిల్లాకు చెందిన కవి, రచయిత విమర్శకులు, విశ్రాంత ఉపాధ్యాయులు వైరాగ్యం ప్రభాకర్ చేస్తున్న భాషా, సాహిత్య, సాంస్కృతిక సేవలను గుర్తించిన సాహిత్య సాంస్కృతిక భాష కళా రంగాల ప్రోత్సాహ వేదిక కాకినాడ 2022 సంవత్సరం ఉగాది ఉత్తమ సాంస్కృతిక పురస్కారాన్ని అందించి మెమొంటో పురస్కార ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు.ఏప్రిల్ 2 , ఆదివారం రోజున తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వారి పెన్షనర్ భవన్లో సంస్థ వ్యవస్థాపకులు దాడి చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరిగిన ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్నూలు జల వనరుల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ , కవయిత్రి యస్.రత్నలక్ష్మి గారు వైరాగ్యం ప్రభాకర్ ను ఘనంగా సన్మానించారు.సంస్థ ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన నలుగురిలో ప్రభాకర్ ఒకరుగా గుర్తింపు పొందడం విశేషం.ఉగాది సందర్భంగా కవులు తమతమ కవితలను వినిపించారు. కార్యక్రమంలో సహృదయ సంస్థ సభ్యులు మార్ని జానకి రామచౌదరి, ప్రముఖ గేయ రచయిత, గాయకులు మేడిశెట్టి శ్రీరాములు,వ్యాఖ్యాత ఆర్.వి.వి.రాజా పురస్కార గ్రహీతలు,కవులు, సాహిత్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న నృత్య సంగీత విభావరి

ఒకప్పుడు వైభవంగా వెలుగొందిన పౌరాణిక పద్యనాటక కళ నేడు అనేక సమస్యలకు గురవుతోందని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పూర్వ వీసీ ప్రొ॥ కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయ గానసభల ఆధ్వర్యంలో కళా దీక్షితులు కళావేదికలో పౌరాణిక పద్యనాటక సప్తాహం రెండో రోజైన సోమవారం రాత్రి కృష్ణ తులాభారం ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఇనాక్ నటీనటులను సన్మానించారు. కళలు ఉత్తమ వ్యక్తిత్వాన్ని, మానవతా దృక్పథాన్ని ఇస్తాయన్నారు. ఈ సభకు గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించారు. నాట్యగురువు భారతి, నటుడు కృష్ణశాస్త్రి, సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో కొత్త జిల్లాలకు ఎల్‌జీడీ కోడ్‌ల కేటాయింపు..

అమరావతి, ఏప్రిల్ 6:ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం లోకల్ గవర్నమెంట్ డైరెక్టరీ కోడ్‌లు జారీ చేసింది. వీటికి స్థానిక ప్రభుత్వాల మ్యాపింగ్‌కు ప్రత్యేకంగా ఎల్‌జీడీ కోడ్‌లను జారీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. జనగణన నుంచి ప్రభుత్వ పథకాల వరకు అన్నీ కోడ్ ద్వారానే అమలు అవుతాయని కేంద్రం వెల్లడించింది. ఈనెల 4 నుంచి ఏపీలో మరో 13 జిల్లాలను అదనంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం పాలనను ప్రారంభించిన విషయం తెలిసిందే.మన్యం జిల్లాకు 743, అనకాపల్లి జిల్లాకు 744, అల్లూరి జిల్లాకు 745, కాకినాడ జిల్లాకు 746, కోనసీమ జిల్లాకు 747, ఏలూరు జిల్లాకు 748, ఎన్టీఆర్ జిల్లాకు 749, బాపట్ల జిల్లాకు 750 కోడ్ నంబర్లను కేటాయించింది. తిరుపతి జిల్లాకు 752, అన్నమయ్య జిల్లాకు 753, సత్యసాయి జిల్లాకు 754, నంద్యాల జిల్లాకు 755 నంబర్ల కోడ్‌ను కేటాయించింది.


Ministry of Culture
Government of India
Azadi Ka Amrit Mahotsav

సాహిత్య అకాడెమి
మరియు
కళల కాణాచి, తెనాలి
సంయుక్తంగా నిర్వహిస్తున్న
తెలుగు నాటకం - సాహిత్యం
(తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా)
ఒకరోజు సదస్సుకు సాహితీప్రియులందరికీ ఆహ్వానం
శనివారం, 16 ఏప్రిల్ 2022
వేదిక : తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం, తెనాలి

కార్యక్రమం
ప్రారంభ సమావేశం : ఉదయం 10 గంటలకు
స్వాగతం : ఎస్.పి. మహాలింగేశ్వర్, ప్రాంతీయ కార్యదర్శి, సాహిత్య అకాడెమి
అధ్యక్షులు : కె. శివారెడ్డి, సంచాలకులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడెమి
ముఖ్య అతిథి : ఎల్.బి. శ్రీరామ్, సినీ, నాటకరంగ నటులు; రచయిత
పరిచయం : సాయిమాధవ్ బుర్రా, సినీ రచయిత, వ్యవస్థాపక అధ్యక్షులు, కళల కాణాచి
కీలకోపన్యాసం : అప్పాజోస్యుల సత్యనారాయణ, అజో-విభో ఫౌండేషన్
తేనీటి విరామం
మొదటి సమావేశం : మధ్యాహ్నం 12.00-1.30
అధ్యక్షులు : వాసిరెడ్డి నవీన్
పత్ర సమర్పణ : కె.పి. అశోక్‌కుమార్ / తెలుగు నాటకరంగం - సామాజిక ఉద్యమాలు
కందిమళ్ల సాంబశివరావు / తెలుగు కథ - నాటకరంగం
బిహెచ్. పద్మప్రియ / తెలుగు నవల - నాటకరంగం
భోజన విరామం
రెండవ సమావేశం : మధ్యాహ్నం 2.15-4.00
అధ్యక్షులు : వి.ఆర్. రాసాని
పత్ర సమర్పణ : వాడ్రేవు సుందరరావు / తెలుగు నాటకరంగం - సామాజిక ప్రాసంగికత
వల్లూరు శివప్రసాద్ / తెలుగు నాటక రచనాశిల్పం
దీర్ఘాశి విజయభాస్కర్ / తెలుగు నాటకం - ప్రయోగాలు
రాజీవ్ వెలిచేటి / తెలుగు నాటకం - ఇతర భాషల సాహిత్య ప్రభావం
తేనీటి విరామం
ముగింపు సమావేశం : సాయంత్రం 4.15-5.00
అధ్యక్షులు : చెరుకుమల్లి సింగ, ఉపాధ్యక్షులు, కళల కాణాచి
ముఖ్య అతిథి : గంగోత్రి సాయి, నాటక ప్రయోక్త, నటులు


## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

# 'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 89856131 23కి మెసేజ్ చేయవచ్చు.

### విశ్వ మనోహరం

(ప్రథమ)

సాయంసంధ్యా సమయంలో
చల్లని పిల్ల సమీరాలు మెల్లగా
నీలి మబ్బుల పల్లకీలను మోస్తు
మెత్తగా మేనును నిమురుతూ
సాగిపోతోంది పన్నులు విధించక
విశ్వ కళ్యాణ కారిణియై ....
విహంగ చిత్రాలు సిత్రంగ
వివిధ రూపాల్లో తలపింపజేస్తోంది
తెల్లని ఏనుగులు ఎర్రని గుర్రాలు
నల్లని నక్కలు బొచ్చు కుక్కలు
ఒకటేమిటి
కలహంసలు కాకి రెక్కలు
పిచ్చుక కూతలు కోకిల కంఠాలు
బోరగద్దలు కంచర గాడిదలు
రాబందులు రాకాసి పిల్లులు
రాక్షసులు గదా యుద్ధాలు
కనిపించే కమనీయ దృశ్య మాలికలు
మనోల్లాసం మనోహరంగా కల్పించె
రసాల సాల గగన తలాన నర్తన శాల
విహంగాల విరుపుల మెరుపులతో...
విశ్వంలో విశ్వ మనోహర మంజూష
మేఘాల దాపున ముచ్చట గొలిపే
మంజుల మనోజ్ఞ కలహంసల మరీచి
బొండు మల్లియల మాలల మాదిరి
పికపికల బకాల బారుల దార
మిన్గంగయై మిన్నంటి మెరుపులు....
మదినిండ కురియగా ముల్లోకాలు
ముప్పిరి గొన్న ముదముతో
ముసకలేసాయి.

-కేశరాజు వేంకట ప్రభాకర్ రావు.
6281697982/8497924605

### విహంగాల కోరికలు

(ద్వితీయ)

మదికొలనులో విరిసిన
ఆశల కలువలు
అందాల జాబిలిని
అందుకోవాలని నింగికేసి
చారడేసి మొగ్గల కన్నులతో
ఎదురు చూస్తున్నాయి!!.
ఊహలకు రెక్కలొచ్చి
మనసేమో గగనసీమలో
మేఘాలతేరుపై తేలిపోవాలని విహంగ
విహారం చేస్తూ
ఉయ్యాల ఊగుతూ...
మురిసి మైమరచిపోతుంది!!
ఎగరే గువ్వల మధ్యన
కువకువమంటూ
రెక్కలు వార్చుతూ
గాలిలో విన్యాసాలు చేస్తూ
కనువిందుగా ఎగరాలని
మది ఉవ్విళ్ళూరుతుంది!!
ఆకాశపందిరికింద
సయ్యాటలాడే...
నీలిమేఘాన్ని
గాలిలో విహారంచేస్తూ
చిరుచినుకుల జల్లు
కురిపిస్తూ సంబరాలు...
చేయాలని ఎన్నెన్ని
విహంగాల కోరికలో!!

-సహజ

# కవులకు సామాజిక స్పృహ అవసరం

కవులకు సామాజిక స్పృహ అవసరమని ప్రముఖ కవి, సాహితీవేత్త రామకృష్ణ చంద్రమౌళి అన్నారు. ఆయన నిర్వహించిన 50 కవి సమ్మేళనాలను పురస్కరించుకుని శివం రోడ్డులోని శ్రీధర్ ప్లాజ అండ్ నటరాజ రెసిడెన్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అభినందన కార్యక్రమం జరిగింది. రామకృష్ణ చంద్రమౌళి, గిరిజారాణి దంపతులను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధి సీఎస్‌రావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆరు వేల కవితలు, పలు పుస్తకాలు రాయడమే కాక సేవా, సామాజిక కార్యక్రమాలను నిర్వహించారని కొనియాడారు. కరోన సమయంలో పేద కార్మికుల కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారని అన్నారు. దారిద్రరేఖ దిగువనున్న ప్రతిభావంతులైన పలువురు విద్యార్థులకు ఫీజు చెల్లించారని అన్నారు. రామకృష్ణ చంద్రమౌళి మరిన్ని సేవా, సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సీపీరావు జి. శ్రీనివాస్, అయ్యంగారు కె.తిరుమలరావు, టి.రవిశంకర్, కె. విజయరాం, సి, రాధ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'పరావర్తనం' ఆవిష్కరణసభలో నారాయణశర్మ, రాపోలు సీతారామరాజు, సాహిత్య అకాడమీ జూలూరీ గౌరీశంకర్, డా॥రఘు, ముఖ్యమంత్రి ఓఎస్‌డి దేశపతి శ్రీనివాస్


ఆహ్వానము
జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
శ్రీ గుదిబండి వెంకటరెడ్డి సంపాదకత్వంలో
వెలువడుతున్న "బాల్యం" కవితా సంకలనం ఆవిష్కరణ - అంకితం
కృతి స్వీకర్త
శ్రీ వల్లూరి శ్రీరామచంద్ర మూర్తి
ముఖ్యఅతిథి : డా॥ కె.వి. రమణ, ఐ.పీ.ఎస్. (ర్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
సభాధ్యక్షులు : లయన్ డా॥ చిల్లా రాజశేఖరరెడ్డి స్థాపకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆర్య
కీలకప్రసంగం : శ్రీ లంక లక్ష్మీనారాయణ అధ్యక్షులు, యువకళావాహిని
అతిథుల సత్కారం : డా॥ రామరాజు శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రొఫెషనర్స్ అసోసియేషన్
సంకలనం సమీక్ష : శ్రీమతి శైలజామిత్ర కవయిత్రి, రచయిత్రి
మొదటి ప్రతుల కొనుగోలు : శ్రీ సయ్యద్ జానీభాషా కవి, రచయిత, గుంటూరు
కృతి స్వీకర్త స్పందన : శ్రీ వల్లూరి శ్రీరామచంద్ర మూర్తి
సాంస్కృతిక కార్యక్రమం: సంగీత విభావరి
గానం: అ శ్రీమతి చిల్లా శివపార్వతి, స్థాపకురాలు, శ్రీ శ్యామగాయిత్రి మ్యూజిక్ అకాడమి శిష్యులు
తేది: 08-04-2022, శుక్రవారం, ఉదయం 10:00 గంటలక